Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 263 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)


మంగళవారం, 2 - 6 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

# డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాం

## - ఎటువంటి రాజకీయ జోక్యం, మధ్యవర్తుల ప్రమేయం, అక్రమాలకు అవకాశం లేదు - నిబంధనల ప్రకారమే అర్హులైన క్రీడాకారులకు నియామకాలు - తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించిన వారిపై కఠిన చర్యలు తప్పవు : రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్





**అమరావతి, (రాజధాని వార్తలు):** డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా నిర్వహించినట్లు రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో ప్రతి దశను సాంకేతిక ఆధారిత ఆన్‌లైన్ విధానంలో నిర్వహించామని, అభ్యర్థులు దరఖాస్తు సమర్పణ నుంచి పోస్టు ఎంపిక వరకు ఎటువంటి వ్యక్తిగత సంప్రదింపులు లేకుండానే ప్రక్రియ పూర్తయిందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో శాప్ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఇటీవల కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వచ్చిన వార్తలు, సందేహాల నేపథ్యంలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు మరియు అభ్యర్థులకు వాస్తవ పరిస్థితులను స్పష్టంగా తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**2024 నూతన క్రీడా విధానం - క్రీడాకారులకు విస్తృత ప్రోత్సాహం**

రాష్ట్ర విభజన అనంతరం 2017లో అమలులోకి వచ్చిన క్రీడా విధానం 2022 వరకు కొనసాగిందని, అనంతరం రెండేళ్ల పాటు స్పోర్ట్స్ పాలసీ లేకపోయిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం 2024 డిసెంబర్‌లో జి.ఓ. నెం.18 ద్వారా సమగ్ర నూతన క్రీడా విధానాన్ని అమలు చేసిందని తెలిపారు. "Sports for All" లక్ష్యంతో యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం, మహిళా మరియు పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించడం, ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, ప్రతిభావంతుల గుర్తింపు, అంతర్జాతీయ స్థాయి ప్రోత్సాహకాలు మరియు ఉద్యోగావకాశాల విస్తరణ వంటి అంశాలను ఈ విధానంలో పొందుపరిచినట్లు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ శాఖలు, పీఎస్‌యూలు, స్థానిక సంస్థల్లో క్రీడాకారులకు కల్పిస్తున్న రిజర్వేషన్‌ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచడం ఈ ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానంలో కీలక నిర్ణయమని పేర్కొన్నారు.

**కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగానే 65 క్రీడా విభాగాలకు గుర్తింపు**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఎంపికల్లో గుర్తించిన 65 క్రీడా విభాగాలు రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా నిర్ణయించినవి కాదని, భారత ప్రభుత్వ సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ 2024 మార్చి 4న జారీ చేసిన అధికారిక మార్గదర్శకాల ప్రకారమే గుర్తించబడినవని తెలిపారు. ఈ క్రీడా విభాగాలను Category-A, Category-Bగా విభ (మిగతా 2వ పేజీలో)

# వి.ఐ.టి - ఏ.పి విశ్వవిద్యాలయంలో మొట్టమొదటి అమరావతి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చదరంగ పోటీలు ప్రారంభం










**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్ర చెస్ అసోసియేషన్ సహకారంతో విఐటి-ఏపీ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న మొట్టమొదటి విఐటి -ఏపీ అమరావతి అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ 2026 ఘనంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించబడుతున్న అతిపెద్ద అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లలో ఇది ఒకటి. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌ను ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా ప్రారంభించారు. గౌరవ అతిథిగా ఈగిల్ సెల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆకే రవి కృష్ణ హాజరయ్యారు. అలాగే గుంటూరు జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ వకుల్ జిందాల్, గుంటూరు ఈగిల్ సెల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ నగేశ్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డా॥ఎ.సురేష్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఛైర్మన్ కె.వి.వి.శర్మ, ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.జగదీష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో రెండు ప్రధాన ఫిడే రేటెడ్ అంతర్జాతీయ పోటీలు నిర్వహించబడుతున్నాయి. అవి: విఐటి-ఏపి అమరావతి ఇంటర్నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ 2026 (జూన్ 1-5) విఐటి-ఏపి అమరావతి ఇంటర్నేషనల్ అండర్-18 అన్‌రేటెడ్ ప్లేయర్స్ చెస్ టోర్నమెంట్ 2026 (జూన్ 6-8) ఈ రెండు పోటీలకు కలిపి మొత్తం రూ. 30 లక్షల నగదు బహుమతులు అందించనున్నారు. భారతదేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా 1,000 మందికి పైగా క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారు. ఇప్పటికే అమెరికా సహా పలు దేశాలకు చెందిన క్రీడాకారులు నమోదు చేసుకోగా, మరింత అంతర్జాతీయ భాగస్వామ్యం ఉండనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, చెస్ అనేది వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, సహనం మరియు నిర్ణయ సామర్థ్యాలను పెంపొందించే ఆట. ఇవన్నీ నాయకత్వం మరియు దేశ నిర్మాణానికి అత్యంత అవసరమైన లక్షణాలు. యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ మేధో వికాసానికి వేదికగా నిలుస్తున్న ఈ అంతర్జాతీయ టోర్నమెంట్‌ను నిర్వహించిన వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం మరియు ఆంధ్ర చెస్ అసోసియేషన్‌ను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు యువత సమగ్ర అభివృద్ధికి దోహదపడటమే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా మరియు విద్యా రంగాల్లో ప్రతిష్ఠాత్మక కేంద్రంగా నిలబెడతాయని పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆకే రవి కృష్ణ మాట్లాడుతూ, ఈ చెస్ ఉత్సవం నిర్వహణ స్థాయి మరియు సమగ్రత నిజంగా ప్రశంసనీయం. వివిధ ప్రాంతాలు, దేశాలకు చెందిన క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా పోటీ నైపుణ్యాలే కాకుండా సాంస్కృతిక మార్పిడి మరియు పరస్పర అభ్యాసానికి కూడా ఇది దోహదపడుతోంది. ముఖ్యంగా యువ క్రీడాకారులు మరియు వారి కుటుంబాలకు ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అవకాశాలు కల్పించేందుకు చేసిన కృషి అభినందనీయమని అన్నారు. పోటీలకు హాజరైన క్రీడాకారులను స్వాగతిస్తూ విఐటి-ఏపి విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ డా॥ పి.అరుళ్‌మొళి వర్మన్ మాట్లాడుతూ, విఐటి-ఏపై విశ్వవిద్యాలయంలో విద్య అనేది తరగతి గదులు, ప్రయోగశాలలకు మాత్రమే పరిమితం కాదని, అమరావతి అంతర్జాతీయ చెస్ ఉత్సవం వంటి కార్యక్రమాల ద్వారా యువతలో విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలు మరియు క్రీడా ప్రతిభను పెంపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియచేయారు. గుంటూరు జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, చెస్ వంటి మేధో క్రీడలు బాధ్యతాయుతమైన, ఏకాగ్రత కలిగిన మరియు సవాళ్లను ఎదుర్కొనే పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలియచేసారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.ఎ.సురేష్ మాట్లాడుతూ, అమరావతి అంతర్జాతీయ చెస్ ఉత్సవం ఆంధ్రప్రదేశ్‌లో చెస్ అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పించడం ద్వారా యువ ప్రతిభకు తమ రేటింగ్‌లను మెరుగుపరుచుకోవడానికి, విలువైన అనుభవాన్ని పొందడానికి మరియు జాతీయ, అంతర్జాతీయ విజయాల వైపు ముందుకు సాగేందుకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఛైర్మన్ కె.వి.వి.శర్మ మాట్లాడుతూ, సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు చెస్‌ను అందుబాటులోకి తీసుకు రావాలనే మా నిబద్ధతకు ఈ టోర్నమెంట్ ప్రతిబింబం. విఐటి-ఏపి విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం వల్ల ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ఈ పోటీని నిర్వహించగలుగుతున్నామని, ఇది వందలాది మంది క్రీడాకారులు మరియు వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. గుంటూరు ఈగిల్ సెల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నగేశ్, "డ్రగ్స్ రహిత భారతదేశం - డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్" లక్ష్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొనే వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ జగదీష్ చంద్ర ముదిగంటి, డా॥ ఖాదీర్ పాషా (డిప్యూటీ డైరెక్టర్, స్టూడెంట్ వెల్ఫేర్), డా॥ ఎన్.రామచంద్ర రావు (ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్) చదరంగ క్రీడాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.






# సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీగా బాధ్యతలు చేపట్టిన తేళ్ల కస్తూరి





**అమరావతి: , (రాజధాని వార్తలు):** సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీగా తేళ్ల కస్తూరి సోమవారం (జూన్ 1న) స్థానిక మీడియా అకాడమీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పూర్వపు సెక్రెటరీ శ్రీ మణిరామ్ రిటైర్మెంట్ కారణంగా ప్రస్థుతం జోన్ 3 జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తోన్న తేళ్ల కస్తూరికి 'సెక్రెటరీ' గా పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ సమాచార శాఖ డైరెక్టర్ ఉత్తరువులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ ఉత్తరువుల ను అనుసరించి సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీగా పూర్తి అదనపు బాధ్యతలు ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా అకాడమీ మేనేజర్ ఎం.భాస్కర నారాయణ అకాడమీలో అమలవుతోన్న పలు కార్యక్రమాలను సెక్రెటరీ తేళ్ల కస్తూరికి వివరించారు. ఈ సందర్భంగా పూర్వపు మీడియా అకాడమీ సెక్రెటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, పలువురు పాత్రికేయులు సెక్రెటరీ కస్తూరి బాయిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాం

(మొదటి పేజీ తరువాయి)

జించి, ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థుల ఎంపిక చేపట్టినట్లు వెల్లడించారు.

**ఒలింపిక్ పతక విజేతలకు రూ.7 కోట్ల ప్రోత్సాహకం**

ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించే ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్ల నగదు బహుమతి ప్రకటించిందని తెలిపారు. గతంలో రూ.70 లక్షలుగా ఉన్న ప్రోత్సాహకాన్ని భారీగా పెంచడం ద్వారా క్రీడాకారుల్లో నూతన ఉత్సాహం నింపామని పేర్కొన్నారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా, యూనివర్సిటీ గేమ్స్, జోనల్ పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీల వరకు మొత్తం 96 ప్రాధాన్యత కేటగిరీలను ప్రభుత్వం స్పష్టంగా నిర్దేశించిందన్నారు.

**డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో 421 పోస్టుల నోటిఫికేషన్**

డీఎస్సీ ద్వారా మొత్తం 16,347 పోస్టులను నోటిఫై చేయగా, అందులో 3 శాతం క్రీడా కోటా కింద 421 పోస్టులను కేటాయించినట్లు తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో 3,600 మంది అభ్యర్థులు మొత్తం 5,326 దరఖాస్తులు సమర్పించగా, తుది ఎంపికలో 382 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయని, ఇంకా 39 పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయని వెల్లడించారు. అన్ని పోస్టులు భర్తీ కాకపోవడమే ఎంపికలు పూర్తిగా అర్హత, ప్రాధాన్యత మరియు ప్రభుత్వ నిబంధనల ఆధారంగానే నిర్వహించబడినట్లు స్పష్టం చేస్తోందన్నారు.

**తొలిసారిగా పూర్తిస్థాయి డిజిటల్, ఆన్‌లైన్ విధానం**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామక ప్రక్రియను పూర్తిస్థాయి వెబ్ ఆధారిత ఆన్‌లైన్ విధానంలో నిర్వహించినట్లు తెలిపారు. అభ్యర్థులు OTP ఆధారిత సురక్షిత ధృవీకరణతో తమ వ్యక్తిగత, విద్యార్హతలు, క్రీడా వివరాలను స్వయంగా పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. అభ్యర్థుల అర్హతలకు అనుగుణంగా పోస్టులు ఆటోమేటిక్‌గా ప్రదర్శించబడే విధంగా వ్యవస్థను రూపొందించడం ద్వారా మానవ జోక్యానికి అవకాశం లేకుండా పారదర్శకతను నిర్ధారించామని తెలిపారు. జిల్లా, పోస్టుల వారీగా ఖాళీల వివరాలను పోర్టల్‌లో అందుబాటులో ఉంచి అభ్యర్థులు స్వయంగా పోస్టులను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, దరఖాస్తు వివరాల డౌన్‌లోడ్, ప్రింట్ సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయించగా, సంబంధిత సంఘాలు, ఫెడరేషన్లు, యూనివర్సిటీలు మరియు ఇతర అధికార సంస్థల ద్వారా వాటి నిజానిజాలను నిర్ధారించిన అనంతరమే తాత్కాలిక ప్రాధాన్యత జాబితాను రూపొందించినట్లు వెల్లడించారు. అదేవిధంగా, డీఎస్సీకి నిర్దేశించిన విద్యార్హతల విషయంలో ఎటువంటి సడలింపులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

**ధ్రువపత్రాల పరిశీలనను పూర్తిస్థాయి పారదర్శక విధానంలో నిర్వహించాం**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలలో ధ్రువపత్రాల పరిశీలనను పూర్తిస్థాయి పారదర్శక విధానంలో నిర్వహించినట్లు తెలిపారు. జి.ఓ.ఎం.ఎస్. నెం.4 ప్రకారం శాప్ ఆరు స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసి, అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన క్రీడా ధ్రువపత్రాలను పరిశీలించినట్లు వెల్లడించారు. అనంతరం 2025 ఆగస్టు 2, 3 తేదీల్లో విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో ఒరిజినల్ ధ్రువపత్రాల భౌతిక పరిశీలన నిర్వహించామని తెలిపారు. తదుపరి సంబంధిత క్రీడా ఫెడరేషన్లు, రాష్ట్ర క్రీడా సంఘాలు, యూనివర్సిటీల ద్వారా ధ్రువపత్రాల నిజానిజాలను నిర్ధారించామని చెప్పారు. అదేవిధంగా విద్యాశాఖ తరఫున 15 మంది అధికారులను నియమించి అభ్యర్థుల విద్యార్హతల ధ్రువపత్రాలను కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలు మరియు సంబంధిత సంస్థల నుంచి పొందిన ధృవీకరణల ఆధారంగానే తాత్కాలిక ప్రాధాన్యత జాబితాను రూపొందించి, 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు శాప్ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించినట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించిన అనంతరం తుది ప్రాధాన్యత జాబితాను సిద్ధం చేసి, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కమిటీ 2025 ఆగస్టు 20న ఆమోదం తెలిపిందన్నారు. అనంతరం ఆ జాబితాను 421 స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీ కోసం 2025 ఆగస్టు 21న విద్యాశాఖకు పంపించినట్లు వెల్లడించారు. దరఖాస్తుల సమర్పణ నుంచి ధ్రువపత్రాల అప్‌లోడ్, పరిశీలన, ధృవీకరణ, ప్రాధాన్యత జాబితా తయారీ వరకు మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడం ద్వారా పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను నిర్ధారించడంతో పాటు బాహ్య జోక్యం, అక్రమాలకు అవకాశాన్ని పూర్తిగా నిరోధించినట్లు తెలిపారు.

**ధ్రువపత్రాల జారీ బాధ్యత ప్రభుత్వానికి కాదు**

క్రీడా ధ్రువపత్రాలను ప్రభుత్వం, శాప్ అధికారులు లేదా ఇతర ప్రభుత్వ సిబ్బంది జారీ చేయరని ఆయన స్పష్టం చేశారు. క్రీడా సంఘాలు, ఫెడరేషన్లు, యూనివర్సిటీలు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేస్తాయని, ఇది 2011 నుంచే దేశవ్యాప్తంగా అమలులో ఉన్న NSDC మార్గదర్శకాల ప్రకారమే కొనసాగుతోందన్నారు. అయితే, ధ్రువపత్రాల నిజానిజాలను నిర్ధారించడం మాత్రం ప్రభుత్వ బాధ్యతగా భావించి బహుస్థాయి పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు.

**బహుస్థాయి ధ్రువీకరణ వ్యవస్థ**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఎంపికల్లో స్క్రూటినీ కమిటీలు, స్క్రీనింగ్ కమిటీ, రాష్ట్ర స్థాయి ఉన్నత కమిటీ ద్వారా దశలవారీగా అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. సంబంధిత క్రీడా సంఘాలు, ఫెడరేషన్లు, యూనివర్సిటీలకు అధికారికంగా లేఖలు రాసి ధ్రువపత్రాల నిజానిజాలను నిర్ధారించామని, రికార్డులు లేవని సమాధానం వచ్చిన ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోలేదని స్పష్టం చేశారు.

**అభ్యంతరాల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం**

తాత్కాలిక జాబితాను ఆన్‌లైన్‌లో ప్రచురించి అభ్యంతరాలు స్వీకరించినట్లు తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి తుది జాబితా సిద్ధం చేసినట్లు చెప్పారు. తరువాత రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదంతో జాబితాను విద్యాశాఖకు పంపగా, స్థానికత, రోస్టర్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం తుది ఎంపిక జాబితా విడుదలైనట్లు తెలిపారు.

**హైకోర్టులో 69 కేసులు - ప్రభుత్వ విధానానికే మద్దతు**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై ఇప్పటివరకు 69 కేసులు హైకోర్టులో దాఖలయ్యాయని తెలిపారు. ఇప్పటికే విచారణ పూర్తైన మూడు కేసుల్లో ప్రభుత్వ కమిటీలు తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన విధానం సరైనవేనని గౌరవ హైకోర్టు స్పష్టం చేసినట్లు వెల్లడించారు. మిగిలిన కేసులపై కూడా న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలను ప్రభుత్వం గౌరవంతో అమలు చేస్తుందని పేర్కొన్నారు.

**తప్పుడు ధ్రువపత్రాలపై కఠిన చర్యలు తప్పవు**

తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు ఎప్పుడైనా నిర్ధారణ అయితే సంబంధిత అభ్యర్థిపై మాత్రమే కాకుండా ఆ ధ్రువపత్రం జారీ చేసిన సంఘం లేదా ఫెడరేషన్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత సంఘాల గుర్తింపును కూడా రద్దు చేసే అవకాశం ఉందన్నారు. డబ్బులు వసూలు చేస్తున్నారన్న సమాచారంపై వెంటనే FIR. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆడియో సందేశాలు వెలుగులోకి వచ్చిన వెంటనే క్రీడల శాఖ స్వయంగా స్పందించి 2025 జూలై 28న పల్లెకోన పోలీస్ స్టేషన్‌లో FIR నమోదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో బొంత రోశయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఆ వ్యక్తి శాప్ ఉద్యోగి కాదని, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా కాదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎవరూ మధ్యవర్తులను నమ్మవద్దని, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని అప్పుడే ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

**పూర్తిస్థాయి పారదర్శకతతోనే ఎంపికలు**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఎంపికల మొత్తం ప్రక్రియను ఎటువంటి రాజకీయ జోక్యం, మధ్యవర్తుల ప్రమేయం, బాహ్య ప్రభావం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించినట్లు ఆయన పునరుద్ఘాటించారు. భారత ప్రభుత్వ మార్గదర్శకాలు, రాష్ట్ర క్రీడా విధానం, క్రీడా ధ్రువపత్రాలు, ప్రాధాన్యత క్రమం, అర్హతలు వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే 382 మంది అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

# సుప్రసిద్ధ కవి, మహోపాధ్యాయుడు కవి కరీముల్లా

## - మే 31, 2026 న ప్రధానోపాధ్యాయునిగా కవి కరీముల్లా ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంలో ప్రత్యేక వ్యాసం



తెలుగు సాహిత్య ఆకాశంలో కొన్ని నక్షత్రాలు కేవలం వెలుగులు మాత్రమే చిమ్మవు – వాటి కాంతి ఒక మార్గదర్శక శక్తిగా మారి, తరతరాల ఆలోచనలను మలుస్తుంది. అది కేవలం కవిత్వానికే పరిమితం కాకుండా, సమాజంలో కమ్మిన చీకట్లను చీల్చే దీప్తిగా నిలుస్తుంది. అటువంటి అరుదైన కాంతి ప్రవాహంగా నిలిచిన కవి, మహోపాధ్యాయుడు షేక్ కరీముల్లా. కరీముల్లా ఒక వ్యక్తి కాదు. ఒక ఆలోచన, ఒక ఉద్యమం, ఒక సాహిత్య సంస్కృతి. ఆయన కలం కేవలం పదాలనే కూర్చలేదు; కాలాన్ని ప్రశ్నించింది, చరిత్రను తిరగరాసింది, సమాజపు మౌనాన్ని ఛేదించింది. పల్నాడు నేలలోని వినుకొండలో పుట్టిన కరీముల్లా, చిన్నతనం నుండే వేమన పద్యాల సాహితీ సుగంధాన్ని పీలుస్తూ పెరిగాడు. బాల్యంలోనే పద్యాల పట్ల అతనికి ఉన్న మమకారం అసాధారణం. అదో అరుదైన అనుభూతి. ప్రతి పద్యంలో అతను కేవలం ఛందస్సును కాదు, జీవన తత్త్వాన్ని చూశాడు. చిన్నతనంలోనే ఉపాధ్యాయుల ప్రశంసలు పొందిన కరీముల్లా, భాషపై ప్రేమను పెంచుకుంటూ, ఆ ప్రేమను ఒక రోజు సమాజంతో పంచుకునే కవిగా మారతానని అప్పుడే తనలో నిర్ణయించుకున్నాడేమో అనిపిస్తుంది. విద్యాభ్యాసం పూర్తయ్యాక ఉపాధ్యాయుడిగా తన జీవితం ప్రారంభించిన కరీముల్లా, బోధనను వృత్తిగా కాకుండా ఒక ధర్మంగా భావించాడు. తరగతి గదిలో అతని పాఠాలు కేవలం పుస్తకాలకే పరిమితం కాలేదు. అక్కడ జీవితం గురించి, న్యాయం గురించి, సమానత్వం గురించి, మానవత్వం గురించి చర్చలు జరిగాయి. ఆ గదుల గోడల్లోనే అతని ఆలోచనలను ఆగిపోలేదు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, విభజనలు, అపోహలు అతని మనసును కలచివేశాయి. విద్యార్థులకు కేవలం పాఠాలు మాత్రమే బోధిస్తే కేవలం ఒక సామాన్య ఉపాధ్యాయునిగా ఉండేవాడు. తను సామాజిక చైతన్యాన్ని రంగరించి విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని నూరిపోసి మహోపాధ్యుడయ్యాడు. తరగతి గదిలో దేశ భవిష్యత్తు నిర్ణయించబడుతుంది అని నమ్మాడు..పిల్లల ప్రపంచంలో తను రారాజులా చరిస్తూ వారి మనోఫలకాలపై లౌకిక ముద్రలను అద్దాడు. మానవీయ విలువలు నేర్పాడు. కులమతాలకు అతీతంగా సహనాన్ని, సామరస్యాన్ని బోధించాడు. తను ఏనుగు పాలెం అనే గ్రామంలో పనిచేసి బదిలీపై మరో గ్రామానికి వెళ్తున్నప్పుడు గ్రామీణ ప్రజలు కరీముల్లా బదిలీ ఆపండి, మా గ్రామంలోనే ఉంచండి అని రెండు ట్రాక్టర్ల జనం వచ్చి అప్పటి అధికార్లను,మండల ప్రెసిడెంట్‌ను అడిగారంటేనే కరీముల్లాను ఆ ప్రజలు ఎంత గుండెలకు హత్తుకున్నారో తెలుస్తుంది. సాహిత్య వ్యాపకంలో పడి ఉపాధ్యాయ వృత్తిని నిర్లక్ష్యం చేయలేదు. విద్యార్థులలో విద్యా చైతన్యానికి, విద్యాభివృద్ధికి ఎంతో శ్రమించాడు. విద్యార్థులకు దేశం పట్ల ప్రేమను,దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన యోధుల చరిత్రను చెప్పాడు.తను ఎక్కడ పనిచేసినా అంకితభావంతో పనిచేసి ఉత్తమ గురువుగా ప్రజల మన్నన పొందాడు. ఏపి ప్రభుత్వంచే జన్మభూమి బెస్ట్ టీచర్ అవార్డు, రోటరీ క్లబ్ వినుకొండ వారిచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్, లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సంయుక్తంగా ఆదర్శ గురు బ్రహ్మ అవార్డు, ఏపి ప్రభుత్వంచే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. తన ఉపాధ్యాయ జీవితంలోనూ, సాహిత్య జీవితంలో అవార్డుల కోసం గాక విలువల కోసం పరిశ్రమించిన మహర్షి కవి కరీముల్లా. కవిగా తన ప్రయాణం ప్రారంభించిన కరీముల్లా, కాలం చూపించిన వాస్తవాల ముందు ఒక కొత్త దిశలో అడుగులు వేసాడు. కవిత్వం అతనికి ఒక భావ వ్యక్తీకరణ మాత్రమే కాదు, ఒక బాధ్యతగా మారింది. 'నా రక్తం కారు చౌక' అని అతను రాసినప్పుడు, అది కేవలం కవిత మాత్రమే కాదు, ఒక సమాజం గౌరవాన్ని కాపాడే నినాదమైంది. 'గాయ సముద్రం'లో అతను వ్యక్తపరిచిన బాధ, ఒక వ్యక్తి బాధ కాదు, అది ఒక వర్గం అనుభవించిన నిశ్శబ్ద వేదన. 'సాయిబు' అనే దీర్ఘ కవితతో అతను తెలుగు సాహిత్యంలో ఒక విప్లవాత్మక మార్పు తీసుకువచ్చాడు. ఆ కవితలో కేవలం భావాలు మాత్రమే లేవు, అందులో ఒక చరిత్ర ఉంది, ఒక సమాజం ఉంది, ఒక ఆత్మగౌరవం ఉంది. అది కేవలం కవితగా కాదు, ప్రకటనగా వినిపిస్తుంది. అనేక మంది యువ కవులకు ఒక దిశను చూపించింది. కరీముల్లా సాహిత్యంలో మరో అపూర్వ ఆవిష్కరణ, 'అబాబీలు'. చిన్న పక్షుల గుంపు భారీ శక్తులను ఎదుర్కొన్న గాథను ప్రతీకగా తీసుకుని, చిన్న కవితా రూపంలో పెద్ద భావాలను వ్యక్తపరచగలదని ఆయన నిరూపించాడు. అబాబీలు కేవలం ఒక కవితా ప్రక్రియ కాదు, అదొక తత్త్వం. చిన్నదైనా శక్తివంతమైన స్వరం, అణగారిన వర్గాల గొంతుకగా మారగలదని చూపించిన ఆ ప్రక్రియ, తెలుగు సాహిత్యంలో ఒక కొత్త తరంగాన్ని సృష్టించింది. అనేకమంది కవులు ఈ రూపాన్ని ఆమోదించి, తమ భావాలను అబాబీల రూపంలో వ్యక్తపరచడం ప్రారంభించారు. ఈ విధంగా, కవి ఆవిష్కరణ ఒక ఉద్యమంగా మారింది. కేవలం వ్యక్తిగత సాహిత్యంతో సరిపెట్టుకోని కరీముల్లా, సమూహ చైతన్యాన్ని నిర్మించడానికి ముందుకొచ్చాడు. 'మురసం' స్థాపించాడు. రచయితలకు ఒక వేదికను అందించాడు. ఈ వేదిక కేవలం రచనలకే పరిమితం కాలేదు, ఆలోచనల మార్పిడి కేంద్రంగా, ఒక సాహిత్య పాఠశాలగా, ఒక చైతన్య వేదికగా మారింది. ఇక్కడ కవులు కేవలం కవితలు రాయడం మాత్రమేకాదు; వారు తమ స్వరాన్ని ఎలా వినిపించాలో, తమ గుర్తింపును ఎలా నిలబెట్టుకోవాలో నేర్చుకున్నారు. కరీముల్లా రచనలు విస్తృతం – కవిత్వం, వ్యాసాలు, చరిత్ర, అనువాదాలు.. వీటన్నింటిలోనూ ఒకే మూల సూత్రం ఉంది.. సమాజంపట్ల బాధ్యత. అతని కలం ఫాసిజాన్ని ప్రశ్నిస్తుంది, ఐసిస్ తరహా మత తీవ్రవాదాన్ని ఖండిస్తుంది. అంతర్జాతీయ సామ్రాజ్యవాదాన్ని సవాలు చేస్తుంది, జియోనిజంపై విమర్శనాత్మక దృష్టి సారిస్తుంది. దేశంపై ప్రేమను బోధిస్తుంది. విశ్వమానవ ప్రేమకు బీజం వేస్తుంది. ఈ విస్తృత దృక్పథం అతన్ని ఒక ప్రాంతీయ కవిగా మాత్రమే కాకుండా, విశ్వవ్యాప్త ఆలోచన కర్తగా తయారు చేసింది. అతని కవిత్వంలో ఉన్న రాజకీయ చైతన్యం, సామాజిక అవగాహన, తాత్విక లోతు, అన్నీ కలిసి అతన్ని ఒక ప్రత్యేక కవిగా నిలబెడతాయి. అందుకే ఓ పత్రికలో కరీముల్లా కవిగా వినుకొండ వాడైనా కవిత్వపరంగా ప్రపంచం వాడు అని రాసింది. కరీముల్లా సాహిత్యం విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాల్లో చోటు సంపాదించడం, పరిశోధనలకు అంశంగా మారడం, అతని కవిత్వ ప్రభావానికి నిదర్శనం. ఒక కవి రచనలు పాఠ్యాంశాలుగా మారడం అంటే, కేవలం భావోద్వేగాలకు పరిమితం కాకుండా, అవి ఆలోచనలను ఆహ్వానిస్తాయని అర్థం. విద్యార్థులు అతని కవిత్వాన్ని చదువుతారు, విశ్లేషిస్తారు, ప్రశ్నిస్తారు. ఇదీ సజీవ సాహిత్య లక్షణం. అనేక అవార్డులు, పురస్కారాలు అతని కృషిని గుర్తించినప్పటికీ, కరీముల్లా సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే అవి మాత్రమే సరిపోవు. అతని అసలు విజయాన్ని కొలవాలంటే, అతను సృష్టించిన చైతన్యాన్ని చూడాలి. అతని కవిత్వం వల్ల ఎన్ని మనసులు మేల్కొన్నాయి? ఎన్ని ప్రశ్నలు పుట్టాయి? ఎంతమంది కొత్త కవులు పుట్టుకొచ్చారు? ఇదే అతని నిజమైన విజయ గాథ. కరీముల్లా ఒక వ్యక్తి కాదు, ఒక ప్రవాహం. ఆ ప్రవాహం సాహిత్యాన్ని ఒక సాధనంగా మార్చింది. కవిత్వాన్ని ప్రతిఘటనగా మలిచింది. అక్షరాలను ఆయుధంగా ఉపయోగించింది. అతని ప్రతి పదం ఒక ప్రశ్న. ప్రతి కవిత ఒక ప్రకటన. ప్రతి రచన ఒక పిలుపు.. నిజం కోసం, న్యాయం కోసం, మనిషితనం కోసం. ఈ కాలంలో నిజం మాట్లాడటం ఒక ధైర్యం అయితే, ఆ ధైర్యాన్ని తన జీవన విధానంగా మార్చుకున్న కవి కరీముల్లా. అతని కలం ఇంకా ఆగలేదు. రాస్తూనే ఉంది – కాలాన్ని ప్రశ్నిస్తూ, సమాజాన్ని మేల్కొల్పుతూ, మానవత్వాన్ని కాపాడుతూ...కాబట్టి, కరీముల్లా గురించి చెప్పడం అంటే ఒక కవిని పరిచయం చేయడం కాదు; ఒక సాహిత్య యుగాన్ని అర్థం చేసుకోవడం. అతని సాహిత్యం చదవడం అంటే కేవలం అక్షరాలను చూడటం కాదు, ఒక సమాజం గుండె చప్పుళ్లను వినడం, ఒక చరిత్రను అనుభవించడం, ఓ కొత్త భవిష్యత్తును ఊహించడం.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

## - పేర్నాడు ప్రాథమిక వైద్యశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే విజయశ్రీ





**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ రోగాల నివారణ కోసం వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ వైద్య అధికారులకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే సూళ్లూరుపేట మండలంలోని పేర్నాడు ప్రాథమిక వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రిలోని రోగులతో నేరుగా మాట్లాడిన వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు వైద్య వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేల తల్లిని సంరక్షించుకోవటం మనందరి బాధ్యత

## - ఏ డీ ఏ ఎన్.మోహన్ రావు





**గుంటూరు, (రాజధాని వార్తలు):** పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమంలో భాగంగా వట్టి చెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలో ఖేత్ బచ్చావో అభియాన్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అధిక రసాయన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించిన అధికారులు అధిక ఎరువులు వాడడం వలన భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతాయన్నారు. సేంద్రియ కర్బణం తగ్గడం వలన చౌడు పెరుగుతుందని, రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్ట్, జీలుగ, జనుము మరియు పిల్లి పెసర పంటల ద్వారా భూసారం పరిరక్షించుకోవచ్చని. సేంద్రియ ఎరువులతో కలిపి వాడడం వలన భూముల సమతుల్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు, ఆత్మ పీడీ జి.వెంకటేశ్వర రావు, డి పి డి, తోటకూర శ్రీనివాసరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి, సిఐపిఎంసి జె డి ఏ మనోజ్ గోస్వామి, ఏడీఏ కొల్లా వీరయ్య చౌదరి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వరప్రసాద్ బాబు, వ్యవసాయ అధికారి సి హెచ్ సునీత, వి ఏ ఏ హారిక పలువురు రైతులు పాల్గొన్నారు.

# విశాఖలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయండి : మంత్రి నారా లోకేష్

**అమరావతి, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ సీఈవో రాబిన్ ఖుదాను ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. సోమవారం ముంబయిలో ఎయిర్ ట్రంక్ సీఈవోతో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ పట్నం అన్ని విధాలా అనుకూలత కలిగి ఉందని ఆయనకు మంత్రి లోకేష్ వివరించారు. అలాగే డేటా సెంటర్ హబ్‌గా విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఏఐ, డేటా హైపర్ స్కేల్ హబ్‌గా విశాఖ నగరం ఆవిర్భవిస్తోందన్నారు. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీ కనెక్స్ తదితర ప్రధాన ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని రాబిన్ ఖుదాకు మంత్రి లోకేష్ సోదాహరణగా వివరించారు. విశాఖపట్నం నగరంలో 6 గిగావాట్ల డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎయిర్ ట్రంక్ సీఈవోకు లోకేష్ స్పష్టం చేశారు. మల్టీ - గిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకో సిస్టమ్ అభివృద్ధిపై తాము దృష్టి సారించామన్నారు. ఎయిర్ ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయా లని ఆ సంస్థ సీఈవో రాబిన్ ఖుదాకు మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతాల్లో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని రాబిన్ ఖుదాకు లోకేష్ చెప్పారు.



డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ కోసం రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు కూడా తమ వద్ద సిద్ధమవుతున్నాయని చెప్పారు. ప్రఖ్యాత హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో డేటా సెంటర్లను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది అక్టోబర్‌లో మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తొలిసారి రాబిన్ ఖుదాతో మంత్రి లోకేష్ తొలిసారి సమావేశమయ్యారు. ఆ తర్వాత భారత్‌లో విస్తరణ కోసం ఎయిర్ ట్రంక్ సంస్థ బృందం పలుమార్లు ఏపీ ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది. భారత్‌లో ఒక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసిన తర్వాత విస్తరణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. మరో వైపు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎయిర్ ట్రంక్ భారత్‌లో ప్రవేశించిన సంగతి తెలిసిందే. ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలో ఆ సంస్థ ప్రాజెక్టులు కలిగి ఉన్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అలుపెరగని యోధుడు జెట్టి గోపిరెడ్డి



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండలం లేగుంట పాడు గ్రామ మాజీ సర్పంచ్, పెన్నా డెల్టా చైర్మెన్ జెట్టి గోపిరెడ్డి ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, వాటి పరిష్కారం కోసం ఆయన చూపే చొరవ, నిబద్ధత అందరికీ ఆదర్శప్రాయంగా ఉందని పలువురు ప్రశంసించారు. సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహన, వాటి పరిష్కారానికి ఆయన చేసే నిరంతర కృషిని చూసి మంత్రి నిమ్మల రామానాయుడు సైతం గోపి రెడ్డి ప్రజా సేవను గుర్తించారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నిబద్ధత, సేవా తపన కలిగిన వ్యక్తి కోవూరు నియోజకవర్గంలో ఉండడం, ముఖ్యంగా అందరి మధ్య ప్రజాసేవలో నిరంతరం కొనసాగడం నిజంగా అదృష్టకరం. శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తూ ముందుకు సాగుతున్న గోపిరెడ్డి అందరికీ స్ఫూర్తిదాయకం అని పలువురు కొనియాడారు. పైగా మహానాడు కార్యక్రమంలో అత్యంత చొరవ చూపి సపలీకృతం చెయ్యడంలో అడుగులు వేశారు. బాధితుల పట్ల వెంటనే స్పందించి అప్పటికప్పుడే ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ద్వారా సమస్యలు నుపరిష్కారం చెయ్యడములో దిట్టగా గోపిరెడ్డి నిలిచారు. నిస్వార్థముతో నడుస్తున్న గోపిరెడ్డికి ప్రజల్లో ఆదరణ మెండుగా వుంది.ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న గోపిరెడ్డికి పలువురు హృదయపూర్వక అభినందనలను తెలిపారు.

# ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చొరవతోనే నియోజకవర్గంలో మహానాడు సపలీకృతం


## - సీనియర్ టీడీపీ నేత బెజవాడ వంశీ కృష్ణ రెడ్డి



**విడవలూరు, (రాజధాని వార్తలు):** ఇందన పొదుపులో భాగంగా కోవూరు నియోజకవర్గంలోని రాష్ట్ర స్థాయి మహానాడు నిర్వహించడం అసాధ్యం అయినందున వర్చ్‌వల్ ద్వారా అమరావతి మంగళగిరిలో మహానాడు అత్యంత ఘనంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగింది అని, కోవూరు నియోజకవర్గం వర్చువల్ మహానాడు కార్యక్రమంను రాష్ట్ర స్థాయిలో కల్లతొలి స్థానముగా గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చొరవ వల్ల సపలీకృతం అయిందని టీడీపి సీనియర్ నేత బెజవాడ వంశీకృష్ణరెడ్డి అన్నారు. కోవూరు నియోజకవర్గంలోని 5 మండలాల్లో కలిపి 11 క్లస్టర్‌గా ఏర్పాట్లు చేసి హైబ్రీడ్ వర్చువల్ మహానాడు కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి నేతలకు కార్యకర్తలకు టీడీపీ నాయకులకు, అభిమానులకు తాను కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మంగళగిరిలో మాట్లాడుతున్న ప్రతి అంశాన్ని వర్చువల్ ద్వారా అందరూ వీక్షించారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి సంక్షేమ లను ఎమ్మెల్యే పలు పథకాలను సీఎం సమక్షములో చక్కగా వివరించడం జరిగిందన్నారు. రెండు రోజుల పాటు వేమిరెడ్డి దంపతులు చొరవతో టీడీపీ నాయకులు వారి వారి మండలాల్లో క్లస్టర్ లలో జరిగిన మహానాడు వేదికలను విజయవంతం చేసారని అన్నారు. ఎన్నడూ లేని నియోజకవర్గంలో టీడీపీ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారని అన్నారు. ఇవన్నీ విజయవంతము కావడానికి అహర్నిశలు శ్రమించిన పెద్దలు వేమిరెడ్డి దంపతులకు తాము అందరూ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారుపార్టీ బలోపేతం కొరకు చేసిన కృషిని టీడీపీ అధిష్టానం వద్ద విపిఆర్ దంపతులు ప్రశంసలను అందుకోవడం నెల్లూరు జిల్లా అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరులో టీడీపీ విజయఢంకా మోగించడం తథ్యం అని వంశీ చెప్పారు.

# రేగడి చీలికలో వీపీఆర్ నేత్ర ఉచిత శిబిరం





**కొడవలూరు, (రాజధాని వార్తలు):** వీపీర్ నేత్ర బస్సు ద్వారా ఏర్పాట్లు చేసిన ఉచిత వైద్య నేత్ర శిబిరంలో రేగడ చీలిక గ్రామంలో నిర్వహించడం జరిగింది. దీని ద్వారా కంటి సమస్య వెహికల్ మా రేగడిచిలుక గ్రామానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని ప్రజలు వ్యక్తం చేసారు.

గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సలహాలు అందిస్తున్న విపిఆర్ సంస్థకు మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వేమిరెడ్డి పుణ్యదంపతుల వల్లే ఆరోగ్యం మెరుగుపడి అద్దాలు ద్వారా కంటి చూపులను అందిస్తున్నారని, ఈ సేవ ద్వారా గ్రామ ప్రజలు ఎంతో ప్రయోజనం పొందుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సేవలను అంది స్తున్న విపిఆర్ నేత్ర బృందానికి రేగడిచిలుక గ్రామ నాయకులు. గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షిస్తున్నామని స్థానికులు చెప్పారు.

# అఖిల భారత యాదవ మహా సంఘం నేత గోరుపర్తికి నెల్లూరులో సత్కారం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మెన్ గోరుపర్తి శ్రీనివాస్ యాదవ్ శనివారం నెల్లూరుకి విచ్చేసిన సందర్భంగా వారిని అఖిల భారత యాదవ మహా సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు పెయ్యల పవన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం కమిటీ మెంబర్లు యాదవ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అఖిల భారత యాదవ మహా సంఘాన్ని బలోపేతం చేసే విధానాలను, ఆర్థిక వనరులను గురించి, జిల్లాలో మండలాల వారీగా కమిటీలు నిర్వహించి వారిని అందర్నీ ఐకమత్యంతో ముందుకు నడిపించే విధి విధానాల గురించి చర్చించడం జరిగింది. త్వరలో నెల్లూరు జిల్లాలో అఖిల భారత యాదవ మహా సంఘం జిల్లా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రతి ఒక్కరికి మేము అందుబాటులో ఉండే విధంగా యాదవులందరికి ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరించాలి అనేటటువంటి ఒక ఉద్దేశంతో ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నారనన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రామ్మోహన్ యాదవ్, నక్కా దినేష్ యాదవ్, డాక్టర్ మహేంద్ర యాదవ్, కోట సురేష్ యాదవ్, ఆవుల అనిల్ యాదవ్, టి.వెంకటేష్ యాదవ్, యం.రాము యాదవ్, మేకల ప్రసాద్ యాదవ్, యం.ఎస్ నందిని యాదవ్, పెయ్యల అపర్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# క్లస్టర్ నాయకులకు ఎమ్మెల్యే అభినందన



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడు విజయవంతమైందని పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం పెద్దాపురం తెదేపా పార్టీ కార్యాలయం వద్ద పెద్దాపురం నియోజకవర్గంలో మహానాడు విజయవంతం కావడం పట్ల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు వర్చువల్ (హైబ్రిడ్) విధానంలో మహానాడు కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారన్నారు. అనంతరం మహానాడు విజయవంతనికి కృషిచేసిన క్లస్టర్ పరిధిలోని నాయకులను ఎమ్మెల్యే చినరాజప్ప, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, రాజా సూరిబాబు రాజు చేతుల మీదుగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కల్పనలో బ్రాండిక్స్ భేష్: కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్









**అచ్యుతాపురం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్త్ర పరి శ్రమ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. శనివారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ ఎస్.ఇ.జెడ్‌లోని ప్రముఖ అంతర్జాతీయ వస్త్ర తయారీ సంస్థ 'బ్రాండిక్స్' ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థలో జరుగుతున్న వస్త్ర ఉత్పత్తుల తయారీ, అంతర్జాతీయ ఎగుమ తులు, దిగుమతుల ప్రక్రియను బ్రాండిక్స్ ఇండియా డైరెక్టర్, భారతీయ భాగస్వామి దొరస్వామి మంత్రికి క్షుణ్ణంగా వివరిం చారు. ఫ్యాక్టరీ అంతటా పర్యటించి కార్మికుల పనితీరును, వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించిన కేంద్రమంత్రి, యాజమాన్యం తీసుకుంటున్న శ్రద్ధను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సం దర్భంగా కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఏకైక రంగం టెక్స్‌టైల్స్ (జౌళి) మాత్రమేనని మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. గార్మెంట్ రంగానికి ఉన్న ఉపాధి సామ ర్థ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టే ప్రతి రూ. 1 కోటి పెట్టుబడికి సుమారు 50 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన వెల్లడించారు. బ్రాండిక్స్ వంటి భారీ పరిశ్రమల ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు వేల సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బ్రాండిక్స్ రాకతో ఈ ప్రాంతంలో మహిళా సాధికారత గణనీయంగా పెరి గిందని స్థానికులు తనకు స్వయంగా తెలిపారన్నారు. ఇంట్లో ఒక మహిళ ఆర్థికంగా బలోపేతమైతే ఆ కుటుంబమంతా వృద్ధి చెందుతుందన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో సరికొత్త విప్లవం**

భవిష్యత్తు అంతా సాంకేతిక వస్త్రాలదేనని కేంద్ర మంత్రి చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన సమావేశంలో ఈ రంగం అభివృద్ధిపై తాము సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం సాధారణ దుస్తులతో పాటు ఏరోస్పేస్, డ్రోన్లు, రక్షణ, వైద్య, వ్యవసాయ రంగాలలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని వివరించారు. ఈ సరికొత్త విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జౌళి శాఖ ఉన్నతాధికారులు, బ్రాండిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విశ్వసనీయత సంక్షోభం: ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియను ఎలా ప్రక్షాళన చేయాలి?

ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా, ప్రభుత్వ ఉద్యోగ పరీక్ష అనేది కేవలం ఒక పరీక్ష మాత్రమే కాదు; అది సామాజిక పురోగతికి ఒక ముఖ్యమైన సాధనం. భారతదేశంలోని లక్షలాది మంది నిరుద్యోగులకు-ముఖ్యంగా గ్రామీణ, మధ్యతరగతి నేపథ్యాల నుండి వచ్చిన వారికి-ప్రభుత్వ ఉద్యోగం అంటే జీవితంలో స్థిరత్వం, ఆత్మగౌరవం, దేశానికి సేవ చేసే ఒక గొప్ప అవకాశం. అయితే, క్వశ్చన్ పేపర్ల లీకేజీలు, ప్రాక్సీ అభ్యర్థులు (మరొకరి స్థానంలో పరీక్ష రాయడం), మార్కుల మూల్యాంకనంలో జరిగే అవకతవకల వల్ల ఈ నియామక ప్రక్రియ యొక్క పవిత్రత దెబ్బ తిన్నప్పుడు, అది ఒక ముత్తాతల తరం ఆశలను అణచి వేస్తుంది. అంతేకాకుండా, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. నియామక ప్రక్రియలో జరిగే అవినీతి, మొత్తం ప్రభుత్వ వ్యవస్థలోనే అవినీతికి పునాది వేస్తుందని విద్యా మరియు విధానపరమైన పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఒక వ్యక్తి లంచం ఇచ్చి లేదా అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ ఉద్యోగంలోకి ప్రవేశించినప్పుడు, అతని ప్రాథమిక ఆలోచన ప్రజా సంక్షేమం వైపు కాకుండా, తాను పెట్టిన పెట్టుబడిని ఎలా రికవరీ చేయాలనే వైపు మొగ్గు చూపుతుంది. ఈ పునాది లోపమే తదనంతరం ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగుల గైర్హాజరు, లంచగొండితనం మరియు అసమర్థతకు దారి తీస్తుంది. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర పరిపాలనా వ్యవస్థల సమగ్రతను పునరుద్ధరించడానికి, ప్రభుత్వాలు కేవలం తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా.. అధునాతన సాంకేతికత, పారదర్శకత మరియు కఠినమైన జవాబుదారీతనంతో కూడిన బహుళ-స్థాయి సంస్కరణలను తీసుకు రావాల్సి ఉంది.

**నియామక వ్యవస్థ పునర్నిర్మాణం**

ప్రభుత్వ నియామకాలలో అవినీతికి ప్రధాన కారణం- వ్యవస్థలో మితిమీరిన మానవ ప్రమేయం, అధికారులకు ఉండే అపరిమిత అధికారాలు. పరీక్షల నిర్వహణ, మూల్యాంకన పద్ధతులను పూర్తిగా ఆధునీకరించడం ద్వారా మధ్యవర్తుల వ్యవస్థను నిర్మూలించవచ్చు. మొదటగా, అన్ని ప్రభుత్వ నియామక పరీక్షలను ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ కంప్యూటర్ ఆధారిత పరీక్షల రూపంలోకి మార్చడం తప్పనిసరి చేయాలి. ప్రాంతీయ నియామకాల్లో భౌతిక క్వశ్చన్ పేపర్లు లీక్ అవ్వడం మనం తరచూ చూస్తుంటాం. దీనికి బదులుగా, పరీక్ష ప్రారంభమవడానికి కొన్ని నిమిషాల ముందు మాత్రమే డిజిటల్ పద్ధతిలో డీక్రిప్ట్ అయ్యే 'రాండమైజ్డ్ క్వశ్చన్ బ్యాంక్స్' (ప్రశ్నలు ఒకే క్రమంలో కాకుండా తారుమారై రావడం) విధానాన్ని అమలు చేయడం ద్వారా పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టవచ్చు. అలాగే, పరీక్షా కేంద్రాలలో ఆధార్‌తో అనుసంధానించబడిన బయోమెట్రిక్ ధృవీకరణను తప్పనిసరి చేయడం ద్వారా ఒకరి బదులు మరొకరు పరీక్ష రాసే (ప్రాక్సీ) విధానానికి చెక్ పెట్టవచ్చు. రెండవది, పరీక్ష ముగిసిన తర్వాత ఓఆర్ఎం షీట్లలో జరిగే ట్యాంపరింగ్‌ను అడ్డుకోవాలి. భౌతిక OMR షీట్ల ద్వారా నిర్వహించే పరీక్షల విషయంలో, పరీక్ష ముగిసిన వెంటనే స్వతంత్ర బహుళ-విభాగాల అధికారుల సమక్షంలో వాటిని స్కాన్ చేసి, తక్షణమే డిజిటల్ రికార్డులను భద్రపరచాలి. దీనివల్ల పరీక్ష ముగిసిన తర్వాత స్ట్రాంగ్ రూమ్‌లలో U²° OMR షీట్లను నింపడం లేదా మార్చడం వంటి అక్రమాలకు తావుండదు.

**పక్షపాత ధోరణిని నిర్మూలించడం**

రాత పరీక్షను సురక్షితంగా నిర్వహించడం ఒక ఎత్తయితే, నియామక బోర్డులలో ఉండే పక్షపాత ధోరణిని తొలగించడం మరొక ఎత్తు. ప్రతిభ ఆధారిత నియామక ప్రక్రియ మాత్రమే బ్యూరోక్రసీలో అవినీతిని తగ్గిస్తుందని, రాజకీయ జోక్యానికి లొంగని స్వతంత్ర సివిల్ సర్వీసెస్‌ను నిర్మించగలదని నిరూపితమైంది. స్వతంత్ర బోర్డుల ఏర్పాటు: రాష్ట్ర స్థాయి నియామకాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలోనే పూర్తి స్వతంత్ర సంస్థలుగా మార్చాలి. రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా ఈ బోర్డులకు పూర్తి రక్షణ కల్పించాలి. ఇంటర్వ్యూ మార్కుల తగ్గింపు: పర్సనల్ ఇంటర్వ్యూలు అనేవి చాలా కాలంగా బంధుప్రీతికి, పక్షపాతానికి వేదికగా మారుతున్నాయి. దీనిని నివారించడానికి, ఇంటర్వ్యూ మార్కులను మొత్తం మార్కులలో గరిష్టంగా 10-12 శాతానికి పరిమితం చేయాలి. నాన్-గెజిటెడ్, దిగువ స్థాయి సాంకేతిక మరియు పరిపాలనా పోస్టులకు ఇంటర్వ్యూలను పూర్తిగా రద్దు చేసి, కేవలం రాత పరీక్ష ప్రతిభ ఆధారంగానే నియామకాలు జరపాలి. బ్లైండ్ ఇంటర్వ్యూ ప్యానెల్స్: ఇంటర్వ్యూలు తప్పనిసరి అయిన చోట 'బ్లైండ్ ఇంటర్వ్యూ' పద్ధతిని అనుసరించాలి. అంటే ఇంటర్వ్యూ చేసే ప్యానెల్‌కు అభ్యర్థి రాత పరీక్ష మార్కులు, పేరు, ఊరు లేదా కులం వంటి వివరాలు తెలియకూడదు. అలాగే ఏ రోజుకా రోజు ఉదయం పూట మాత్రమే ఇంటర్వ్యూ ప్యానెల్ సభ్యులను రాండమ్ పద్ధతిలో కేటాయించడం ద్వారా అక్రమ సిఫార్సులను అడ్డుకోవచ్చు.

**సంపూర్ణ పారదర్శకత - ప్రజా పరిశీలన**

అవినీతిని అంతమొందించడానికి పారదర్శకత అనేది ఒక శక్తివంతమైన ఆయుధం. నియామక ప్రక్రియను పారదర్శకంగా మార్చడం ద్వారా బోర్డులు మరింత బాధ్యతాయుతంగా పనిచేసేలా చేయవచ్చు. సమాచార హక్కు చట్టం యొక్క అసలు ఆశయానికి అనుగుణంగా, నియామక సంస్థలు పరీక్ష ముగిసిన వెంటనే ప్రాథమిక కీ, అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు, కట్-ఆఫ్ మార్కులను అధికారికంగా ప్రచురించాలి. అభ్యర్థులు తమ ఫలితాలను తామే స్వయంగా సరిచూసుకునే అవకాశం ఉన్నప్పుడు, నియామకాల్లో అక్రమాలకు పాల్పడటం సాధ్యం కాదు. అదే సమయంలో, పరీక్షలు నిర్వహించే ప్రైవేట్ వెండర్ల (సాంకేతిక సంస్థల) భద్రతపై ఐఐటీ లేదా ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ద్వారా థర్డ్-పార్టీ టెక్నాలజీ ఆడిట్ నిర్వహించాలి. సాఫ్ట్‌వేర్ కోడింగ్‌లలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవడం ద్వారా హ్యాకింగ్ ముప్పును తప్పించవచ్చు. వీటితో పాటు, వ్యవస్థలో జరిగే అక్రమాలను బయటపెట్టేలా ఉద్యోగులకు లేదా పౌరులకు సురక్షితమైన 'విజిల్ బ్లోయర్' ఛానళ్లను ఏర్పాటు చేయాలి , సమాచారం ఇచ్చిన వారికి పూర్తి రక్షణ కల్పించాలి.

**జవాబుదారీతన సంస్కృతిని పెంపొందించడం**

సాంకేతిక పోర్టళ్లు, ప్రామాణిక పరీక్ష పద్ధతులు ఎంత ఉన్నప్పటికీ.. తప్పు చేసిన వారికి తక్షణమే కఠినమైన శిక్ష పడుతుందనే భయం లేనంత వరకు అవినీతిని అరికట్టలేము. ఉన్నతాధికారులు, పరిపాలనా రథసారధులు అవినీతి విషయంలో రాజీలేని వైఖరిని ప్రదర్శించాలి. అక్రమాలకు పాల్పడిన అంతర్గత సిబ్బందిపై తక్షణ క్రమశిక్షణా చర్యలు మరియు క్రిమినల్ విచారణలు జరిపినప్పుడే, దిగువ స్థాయి సిబ్బందిలో భయం ఉంటుంది. అలాగే, ప్రభుత్వ రంగంలో ఉద్యోగుల జీతభత్యాలు గౌరవప్రదంగా , సమానత్వంతో కూడి ఉండేలా చూడటం ద్వారా కూడా లంచగొండితనాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. భారతదేశంలో ప్రభుత్వ నియామకాలను ప్రక్షాళన చేయడం అనేది అసాధ్యమైన విషయమేమీ కాదు; అది కేవలం రాజకీయ, పరిపాలనాపరమైన సంకల్పంపైనే ఆధారపడి ఉంటుంది. పాతకాలపు, మానవ ప్రమేయం ఎక్కువగా ఉన్న పద్ధతుల స్థానంలో స్వయంచాలక, ఆడిట్ చేయబడిన, పారదర్శక వ్యవస్థలను తీసుకురావడం ద్వారా మాత్రమే అర్హులైన ప్రతిభావంతులకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కేలా చూడగలం. దేశ భవిష్యత్తు, కోట్లాది మంది కష్టపడే యువత నమ్మకం ఈ మార్పుపైనే ఆధారపడి ఉన్నాయి.

# గంజాయి, డ్రగ్స్ తీసుకున్నారా క్షణాల్లో దొరికిపోతారు

**- సరికొత్త డిటెక్షన్ కిట్లతో పోలీసుల తనిఖీలు - జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు పోలీసుల ఉక్కుపాదం - అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో విస్తృత సోదాలు 11 మందికి పాజిటివ్ - అనుమానితులకు డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా పరీక్షలు - నిందితులపై చట్టపరమైన చర్యలు, డీ-అడిక్షన్ సెంటర్లకు తరలింపు**




**అమలాపురం, (రాజధాని వార్తలు):** గంజాయి, డ్రగ్స్ సేవించారా వెంటనే పోలీసులకు దొరికిపోవడం ఖాయం. మత్తు పదార్థాలు సేవించే వారి భరతం పట్టేందుకు పోలీసులు సరికొత్త డిటెక్షన్ కిట్లతో సిద్ధమయ్యారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాను గంజాయి, మత్తుపదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. జిల్లా ఎస్.పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు మత్తుపదార్థాలు సేవించే వారిని, సరఫరా చేసే వారిని నిమిషాల వ్యవధిలో గుర్తించే అత్యాధునిక సాంకేతికతను జిల్లా పోలీసులు రంగంలోకి దించారు. ఇందులో భాగంగా శనివారం అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో ఉన్నతాధికారుల విస్తృత తనిఖీలు అమలాపురంలో నిర్వహించారు.

**తనిఖీలు - ఫలితాలు:**

ఈ తనిఖీల్లో భాగంగా పలువురు అనుమానిత వ్యక్తులను నిలిపి వారికి అత్యాధునిక "గంజాయి/డ్రగ్ డిటెక్షన్ కిట్స్ (బయోచెక్ కిట్స్)" ద్వారా పరీక్షలు నిర్వహించారు. అనుమానితుల నుండి సేకరించిన నమూనాలను ఈ కిట్ ద్వారా పరీక్షించగా కేవలం రెండు నిమిషాల వ్యవధిలోని ఫలితాలు వెల్లడయ్యాయి. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారికి పరీక్ష నిర్వహించగా మొత్తం 11 మంది మత్తు పదార్థాలు సేవించినట్లు (పాజిటివ్)గా నిర్ధారణ అయ్యింది. మత్తుకు బానిసలైన ఈ 11 మంది వ్యక్తులలో మార్పు తీసుకువచ్చేందుకు వారిని తక్షణమే "డీ-అడిక్షన్ సెంటర్ (వ్యసన విముక్తి కేంద్రం)"లో చేర్పించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అదేవిధంగా వారిపై చట్టప్రకారం తీసుకోవలసిన కఠినమైన న్యాయపరమైన చర్యలను పోలీస్ శాఖ చేపడుతుందని తెలిపారు.

**జిల్లా ఎస్.పీ రాహుల్ మీనా హెచ్చరిక:**

జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల మూలాలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టమని ఎస్పీ తెలిపారు. ఇకపై గంజాయి, డ్రగ్స్ సేవించి తప్పించుకుందామనుకుంటే కుదరదని హెచ్చరించారు. ఈ అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా అనుమానితుల మూత్ర లేదా లాలాజల నమూనాలను పరీక్షించి కేవలం రెండు నిమిషాల్లోనే వారు గంజాయితో పాటు 11 రకాల ఇతర మత్తు పదార్థాలు ఏవైనా తీసుకున్నారా లేదా అనే విషయాన్ని ఖచ్చితంగా నిర్ధారించవచ్చునన్నారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును జీవితాలను నాశనం చేస్తున్న ఇటువంటి సామాజిక రుగ్మతలపై మా ఉక్కుపాదం కొనసాగుతుందని ఎస్పీ మీనా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిరంతరం ఈ నిఘా, తనిఖీలు కొనసాగుతూ ఉంటాయని అన్నారు. ఎవరైనా మత్తుపదార్థాల విక్రయాలు జరిపినా, రవాణా చేసినా లేదా సేవించినా వారిపై చట్టపరంగా కఠిన మైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మీనా హెచ్చరించారు. అలాగే మత్తుకు బానిసలైన వారిని గుర్తించి, కౌన్సిలింగ్ ఇచ్చి డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వారి జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ అత్యాధునిక పరికరాల వాడకంతో నిందితులను సులభంగా పట్టుకునే అవకాశం కలిగిందని రానున్న రోజుల్లో తనిఖీలను జిల్లా వ్యాప్తంగా మరింత ముమ్మరం చేస్తామని ఎస్పీ తెలిపారు. అమలాపురం డీఎస్పీ టీ.ఎస్.ఆర్.కె ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, అమలాపురం పట్టణ సీఐ వీరబాబు, అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, ముమ్మిడివరం సి.ఐ మోహన్, ఎస్బీ సీఐ పుల్లారావు పర్యవేక్షణలో అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్స్, పోలీస్ సిబ్బంది ఈ తనిఖీలలో పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని అవమానించిన వారిని అరెస్టు చేయాలి






**అమలాపురం, (రాజధాని వార్తలు):** హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ముసుగులో కొంతమంది ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌ను అవమానింవారని వారిని వెంటనే శిక్షించాలంటూ పలుచోట్ల పోలీస్ స్టేషన్‌లలో జనసైనికులు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం కొందరు మీడియా సమావేశం నిర్వహించి అందులో ప్రొఫెసర్ నాగేశ్వర్ మద్దతుదారులుగా, తెలంగాణా ఉద్యమకారులుగా ప్రాంతీయ విద్వేషాలు రేపేలా వాఖ్యలు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ అవమానించటాన్ని జన సైనికులు, పవన్ అభిమానులు ఖండించారు.

ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ అమలాపురం జనసేన పార్టీ నాయకులు శనివారం అమలాపురం పట్టణ సీఐ వీరబాబుకు ఫిర్యాదు చేశారు. అలాగే అల్లవరం మండలం జనసేన పార్టీ నాయకులు అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బి.సంపత్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అవమానించి, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వారిని తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్డీఎస్ ప్రసాద్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యాళ్ళ నాగ సతీష్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కల్వకొలను తాతాజీ, మాజీ కౌన్సిలర్ యేడిద శ్రీను, సుధా చిన్న, గండి స్వామి, డి ఎస్ ఎన్ కుమార్, మోటూరి సూర్య కిరణ్, అల్లవరం జనసేన పార్టీ నాయకులు సొసైటీ చైర్మన్ కంకిపాటి గోపి, నల్లా రాము, కంకిపాటి వీరబాబు, రొక్కాల నాగేశ్వరరావు, చికెలే చిట్టిబాబు, వర్రే సూరిబాబు, నామాడి నాగరాజు, కంకిపాటి సుబ్బన్న, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# "కార్డన్ అండ్ సెర్చ్"లో నేరాలపై అవగాహన

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణం అమ్మణమ్మ కాలనీలో శనివారం ఉదయం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డిఎస్పీ ఎ బాల గంగాధర్ తిలక్ పర్యవేక్షణలో సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మానమ్మ అపార్ట్‌మెంట్స్ వద్ద "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్ నిర్వహించారు. సిఐ ఎ కృష్ణ భగవాన్ స్టేషన్ సిబ్బందించే చేపట్టిన ఈ కార్యక్రమంలో 22 బైక్‌ల రికార్ధులను పరిశీలించారు. డ్రోన్‌ను వినియోగించి కాలనీ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్, సామర్లకోట పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొనగా సిఐ కాలనీ వాసులతో మాట్లాడుతూ ప్రజలకు మత్తు పదార్థాల దుష్పరిణామాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగం, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని 22 వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అలాగే అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు





తెలియజేయాలని సూచించారు. ఈగల్ డిపార్ట్మెంట్ సహాయంతో మత్తు పదార్థాలు సేవించిన వారిపై కూడా తక్షణ పరీక్షలు నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీ పీజీ సెట్‌లో 5వ ర్యాంకు సాధించిన మల్లీశ్వరి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్ స్టాటిస్టిక్స్ విభాగంలో అమలాపురం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థిని లూటికుర్తి బేబీ దుర్గా మల్లేశ్వరి 5వ ర్యాంకు సాధించింది. రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంక్ సాధించిన మల్లీశ్వరిని కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్ఎన్ నరసింహారావు, చైర్మన్ మల్లిపూడి విజయలక్ష్మి, కరాటం ప్రవీణ్, ప్రిన్సిపాల్ కె ఎస్ వి ఎన్ మనోహర్, వై వరప్రసాద్, జాన్ పాల్, డాక్టర్ కె హేమ విజిత, కె శ్రావణ్ దిలీప్ తదితరులు అభినందించారు.

# ఆటో ప్రమాదంలో 3కు చేరిన మృతులు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట ఐదు తూములు వద్ద ఈనెల 27న జరిగిన ఆటో ప్రమాదంలో ఉప్పాడ కొత్తపల్లి మండలం ఉప్పాడకు చెందిన మరో మహిళ మృతి చెందింది. ఇప్పటికే ఈ ప్రమాదంలో ఉప్పాడకు చెందిన ఇద్దరు చనిపోయారు. కాగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గరికిన సింహాద్రి అనే మహిళ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. దీంతో ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య మూడుకు చేరుకుంది. వరుస మరణాలతో ఉప్పాడ గ్రామం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

# విద్యార్థులకు కంటి పరీక్షలు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి సహకారంతో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కంటి పరీక్ష శిబిరంను చేనేత సొసైటి అధ్యక్షులు ముప్పన వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నిరంతరం కంటి పరీక్షలు చేయించాలని తెలిపారు. మానవ అవయవాల్లో నయనం ప్రదానం అంటరాని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని అన్నారు. విద్యార్థులు మొబైల్‌ను, టీవీని తగ్గించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి రాజేష్ కుమార్ దేవత, శ్రీ కిరణ్ కంటి హాస్పిటల్ ప్రోగ్రాం మేనేజర్ శివ గణేష్, ప్రవీణ భీమన, ఇస్మాయిలు, నాగలక్ష్మి, ప్రశాంత్, మహాలక్ష్మి, దేవి, మృధుల, పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, ప్రజానాట్య మండలి కార్యదర్శి రొంగల వీరాజు, కేదారి నాగు, హర్ష సురెడ్డి, లలిత, లావణ్య, తమనారి సందీప్, కె సందీప్, వీరమ్మల బంగారం, కామేష్, మెర్సీ తదితరులు పాల్గొన్నారు. 200 మంది విద్యార్థులకు, 50 మంది పెద్దలకు కంటి పరీక్షలు నిర్వహించారు.

# 'దురంధర్-యానిమల్' పై నెగెటివ్ సమీక్షలు చదవలేదా విఘ్నేష్?



సోషల్ మీడియా – డిజిటల్ యుగంలో ఈరోజు ఏ సినిమా విడుదలైనా ప్రారంభంలో నెగెటివ్ టాక్ రావడం అనేది చాలా సహజమైన విషయంగా మారిపోయింది. కేవలం మీడియాలో వచ్చే ప్రతికూల సమీక్షల పైనే ఒక సినిమా పూర్తి ఫలితం ఆధారపడి ఉండదని ఇటీవలి కాలంలో చాలా చిత్రాలు నిరూపించాయి. ఇందుకు తాజా ఉదాహరణగా నిలిచింది దురంధర్ చిత్రం. ప్రారంభంలో ఈ సినిమాకు ప్రాంతీయ భాషల్లో ఆశించిన సమీక్షలు రాలేదు. పైగా ఇందులో చూపించిన రక్తపాతం, హింసపై సోషల్ మీడియాలో బోలెడంత నెగెటివ్ ప్రచారం సాగింది. అయినా ఆ తర్వాత నెమ్మదిగా నిలకడైన వసూళ్లను సాధిస్తూ బాక్సాఫీస్ వద్ద నిలబడింది. బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించిన తర్వాత.. ఒకప్పుడు నెగెటివ్ కామెంట్లు చేసిన వారే ఈ సినిమాలో కంటెంట్ మ్యాటర్ బలంగా ఉంది గనుకనే ప్రజలు హిట్ చేశారంటూ ప్రశంసించడం మొదలుపెట్టారు. ఇంతకు ముందు బ్లాక్‌బస్టర్ హిట్ యానిమల్ సినిమా విషయంలోనూ సరిగ్గా ఇదే తరహా వాతావరణం కనిపించింది. ఆ చిత్రం విడుదలైన కొత్తలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగాను నేరుగా టార్గెట్ చేస్తూ.. సినిమాలో విపరీతమైన హింస, రక్తపాతం – స్త్రీ వివక్ష ఉందంటూ చాలా మంది తీవ్రంగా విమర్శించారు. కానీ ఆ విమర్శలన్నింటికీ యానిమల్ సాధించిన రికార్డు స్థాయి కలెక్షన్లే సమాధానంగా మారాయి. అయితే దురంధర్, యానిమల్ వంటి సినిమాలు నెగెటివ్ టాక్‌ను తట్టుకుని నిలబడినట్లుగా.. తన తాజా చిత్రం లవ్ ఇన్సూరెన్స్ కొంపనీ (ఎల్.ఐ.కే) ఎందుకు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయిందో దర్శకుడు విఘ్నేష్ శివన్ విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. తన సినిమాకు వచ్చిన ప్రారంభ నెగెటివ్ సమీక్షలే దెబ్బ కొట్టాయని ఆవేదన చెందుతున్న విఘ్నేష్.. ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ఆ చిత్రానికి గొప్ప ఆదరణ దక్కుతుండటంతో సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ అవుతున్నారు. కానీ నేటి రోజుల్లో ప్రతి సినిమాకు ప్రారంభంలో నెగెటివ్ సమీక్షలు తప్పడం లేదనే వాస్తవాన్ని ఆయన గ్రహించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరికీ మిశ్రమ స్పందనలు సహజంగా మారాయి.

తొలి వీకెండ్ తర్వాతా నిలబెట్టేంత కంటెంట్ కేవలం సినిమాలో ఉండాలి.. అప్పుడే జనం థియే టర్లకు వస్తున్నారు. ఇండస్ట్రీలోని పలు అంశాలపై తన అభిప్రా యాలను నిర్మొహమాటంగా చెప్పే దర్శకుడు విఘ్నేష్ శివన్.. ప్రదీప్ రంగనాథన్, ఎస్‌జే సూర్య, కృతి శెట్టి ప్రధాన పాత్రల్లో తాను తెరకెక్కించిన లవ్ ఇన్సూరెన్స్ కొంపెనీ (ఎల్ఐకే) బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి ఫలితాన్ని అందుకోలేకపోవడంపై ఇన్‌స్టా స్టోరీలో ఒక సుదీర్ఘమైన నోట్‌ను షేర్ చేసారు. దాదాపు 190 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందించిన ఈ చిత్రం థియేటర్లలో కేవలం రూ.66 కోట్లు మాత్రమే వసూలు చేసి నిరాశపరిచింది. 10 ఏప్రిల్ 2026న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం.. ఇటీవల అమెజాన్ ప్రైమ్ లోకి వచ్చిన తర్వాత ఊహించని విధంగా వీక్షకుల నుండి అద్భుతమైన సానుకూల స్పందనను సొంతం చేసుకుంటోంది. ఆన్‌లైన్‌లో ఉన్న నెగెటివిటీ కారణంగానే తాము ఈ సినిమాను థియేటర్లలో చూడలేకపోయామని ఇప్పుడు ఓటీటీలో చూశాక చాలా బాధపడుతున్నామని చెప్తూ ఎంతో మంది తనకు మెసేజ్‌లు పంపుతున్నారని విఘ్నేష్ తన నోట్‌లో పేర్కొన్నారు.

# వరుస రిస్కులు.. అనుపమ ప్లాన్ ఇదేనా?



హీరోయిన్ల కెరీర్‌లో సేఫ్ జోన్‌లో కొనసాగడం చాలా సాధారణ విషయం. ముఖ్యంగా స్టార్ ఇమేజ్, మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మంది హీరోయిన్లు గ్లామర్ పాత్రలు లేదా కమర్షియల్ సినిమాల వైపే మొగ్గు చూపుతుంటారు. కానీ అనుపమ పరమేశ్వరన్ మాత్రం ఆ మార్గానికి భిన్నంగా తన కెరీర్‌ను కొనసాగిస్తోంది. కెరీర్ మొదట్లో పక్కింటి అమ్మాయి పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ మలయాళీ భామ, గత కొంతకాలంగా నటిగా తన సత్తాను చాటే పాత్రలకే ప్రాధాన్యత ఇస్తోంది. తాజాగా రిలీజైన మరీచిక కూడా అదే లిస్ట్ లో చేరింది. సినిమా రిజల్ట్ ఎలా ఉన్నా, అందులో అనుపమ చేసిన పాత్ర మాత్రం ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరీచికలో అనుపమ పోషించిన వెంకటలక్ష్మి పాత్ర సాధారణ హీరోయిన్ క్యారెక్టర్ కాదు. ఒకవైపు అమాయకంగా కనిపించే యువతిగా, మరోవైపు పూర్తిగా భిన్నమైన కోణాన్ని కలిగిన వ్యక్తిగా డైరెక్టర్ ఆమె పాత్రను డిజైన్ చేసిన తీరు ఆడియన్స్ కు సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఓ వైపు పళ్లకు క్లిప్స్, కళ్లద్దాలతో కనిపించే లుక్, మరోవైపు మోడరన్ లుక్‌లోని వైవిధ్యాన్ని ప్రతిబింబించింది. అంతేకాదు, మానసిక సంఘర్షణలతో బాధపడుతున్న యువతిగా ఒక సందర్భంలో కనిపిస్తే, మరో సందర్భంలో పరిస్థితులన్నింటినీ అర్థం చేసుకున్న తెలివైన వ్యక్తిలా కనిపించడం అనుపమ నటనకు మరో పరీక్షగా నిలిచింది. ఈ రెండు షేడ్స్‌ను తెరపై సమర్థంగా ప్రదర్శించడంలో ఆమె బాగా సక్సెస్ అయిందనే అభిప్రాయం ప్రేక్షకుల నుంచి వ్యక్తమవుతోంది. ఈ మధ్య అనుపమ సెలెక్ట్ చేసుకుంటున్న ప్రాజెక్టులను పరిశీలిస్తే, ఆమె స్పష్టంగా ఒక పెర్ఫార్మర్‌గా గుర్తింపు తెచ్చుకోవాలనే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. కార్తికేయ2, కిష్కిందపురి సక్సెస్‌ల తర్వాత కూడా పూర్తిగా కమర్షియల్ ఫార్ములాకు పరిమితం కాకుండా, పరదా, బైసన్, లాక్‌డౌన్, ఇప్పుడు మరీచిక లాంటి విభిన్న కథల వైపు అడుగులు వేస్తోంది. ముఖ్యంగా హీరోయిన్ చుట్టూనే కథ తిరుగుతూ, యాక్టింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యముండే పాత్రలను ఎంచుకోవడం ఆమె కెరీర్‌లో కొత్త అధ్యాయంగా భావించవచ్చు. స్టార్ హీరోల సినిమాల్లో కేవలం సాంగ్స్, రొమాన్స్‌కు పరిమితమయ్యే పాత్రల కంటే సవాళ్లు విసిరే పాత్రల వైపే ఆమె ఆసక్తి చూపడం విశేషం. సాధారణంగా హీరోయిన్లు తమ కెరీర్ సజావుగా వెళ్తున్న టైమ్‌లో ఇలాంటి ప్రయోగాలు చేయడానికి వెనుకాడతారు. ఎందుకంటే ఒక్క తప్పు నిర్ణయం మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కానీ అనుపమ మాత్రం ఆ భయాన్ని పక్కనబెట్టి రిస్క్ తీసుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో అనుపమ చేసిన సినిమాలు కొన్నిసార్లు కమర్షియల్‌గా పెద్ద సక్సెస్‌లు సాధించకపోయినా, నటిగా ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నాయి. మరీచిక విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సినిమా బాక్సాఫీస్ వద్ద ఎంత మేర ప్రభావం చూపుతుందో చెప్పడం ఇప్పుడే కష్టమే అయినా, సినిమాలో అనుపమ యాక్టింగ్ మాత్రం ప్రత్యేకంగా నిలిచిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. అందుకే మరీచికను కేవలం మరో సినిమాలా కాకుండా, అనుపమ పరమేశ్వరన్ కెరీర్‌లో ఒక కీలక మలుపుగా సినీ విశ్లేషకులు చూస్తున్నారు. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా, బలమైన పాత్రలను మోసే నటిగా తన స్థాయిని మరింత బలపరుచుకునే దిశగా అనుపమ ఇప్పుడు అడుగులు వేస్తోంది. ఈ ప్రయోగాల పరంపర కొనసాగితే, ఫ్యూచర్‌లో అనుపమను కేవలం కమర్షియల్ హీరోయిన్‌గా కాకుండా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలకు నమ్మకమైన నటిగా గుర్తించే రోజు దూరంలో లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఓదెల ప్లాన్ ఏంటి? 'మల్టీవర్స్' బాస్‌గా మారుతారా?



సినిమాటిక్ యూనివర్స్‌లు, మల్టీవర్స్‌లపై ఇప్పుడు టాలీవుడ్‌లో ఓ రేంజ్‌లో చర్చలు జరుగుతున్నాయి. హాలీవుడ్ మార్వెల్ తరహా యూనివర్స్‌లు భారీ విజయాలు సాధించిన తర్వాత ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీల్లో కూడా అలాంటి ప్రయత్నాలు స్టార్ట్ అయ్యాయి. అయితే తెలుగు ఇండస్ట్రీలో మాత్రం ఆ కాన్సెప్ట్‌ను లాంగ్ రన్‌లో సక్సెస్ ఫుల్‌గా కంటిన్యూ చేసిన ఎగ్జాంపుల్స్ చాలా తక్కువగా ఉన్నాయి. ఇప్పటివరకు తెలుగులో సక్సెస్ ఫుల్ యూనివర్స్‌గా ఎక్కువగా ప్రస్తావనకు వచ్చేది దర్శకుడు శైలేష్ కొలను రూపొందించిన హిట్ ఫ్రాంచైజీ. హిట్: ది ఫస్ట్ కేస్‌తో మొదలైన ఆ సిరీస్ ఇప్పటికే మూడు పార్టులు పూర్తి చేసుకుంది. ప్రతి పార్ట్‌లో కొత్త కథ, కొత్త హీరోతో ముందుకు వెళ్తూనే, ఒకే వరల్డ్‌కు సంబంధించిన లింక్ ను కొనసాగించడం ఆ సిరీస్ ప్రత్యేకతగా నిలిచింది. శైలేష్ కొలను ముందుగానే ఆ ప్రాజెక్టుకు పెద్ద ప్లాన్ రెడీ చేశారు. మొత్తం ఏడు పార్టులుగా ఆ యూనివర్స్ ను క్రియేట్ చేయాలనే టార్గెట్‌తో సాగుతున్నారు. మొదటి ఆరు పార్టుల్లో వేర్వేరు లీడ్ రోల్స్‌ను పరిచయం చేసి, ఏడో పార్టులో వారందరినీ ఒకే కథలో మిక్స్ చేయాలనే ఆలోచన ఉన్నట్లు గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో హిట్ యూనివర్స్ తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. మరోవైపు దర్శకుడు సుజీత్ కూడా తన సినిమాలను ఒకే యూనివర్స్ లోకి తీసుకు రావాలనే ప్రయత్నం చేస్తున్నారు. సాహో, ఓజీ చిత్రాల మధ్య లింక్ ఉందనే చర్చ ఇప్పటికే సాగుతోంది. సుజీత్ సినిమాటిక్ యూనివర్స్ పేరుతో ఫ్యూచర్ లో మరిన్ని కథలను లింక్ చేసే ప్లాన్ ఉందని చెప్పారు. అయితే ఆ యూనివర్స్ ఇంకా పూర్తిగా ప్రేక్షకుల ముందుకు రాలేదు. అందుకే అది ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాల్సి ఉంది. ఇలాంటి సమయంలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పేరు ఇప్పుడు వినిపిస్తోంది. దసరా సినిమాతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన ప్రస్తుతం నాని హీరోగా ది ప్యారడైజ్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆ తర్వాత మెగాస్టార్ చిరంజీవితో కూడా ఓదెల సినిమా చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. అయితే ఇప్పుడు ది ప్యారడైజ్, చిరంజీవి చిత్రాల మధ్య ఏదో ఒక లింక్ ఉండొచ్చని టాక్ వినిపిస్తోంది. ఆ రెండు సినిమాల ద్వారా ఓదెల తన సినిమాటిక్ యూనివర్స్ స్టార్ట్ చేస్తారని ప్రచారం సాగుతోంది.

అదే సమయంలో ఒక యూనివర్స్‌ను సక్సెస్ ఫుల్‌గా నిలబెట్టాలంటే కేవలం కనెక్షన్లు చూపించడం సరిపోదు. స్ట్రాంగ్ స్టోరీస్, ఆకట్టుకునే పాత్రలు, లాంగ్ ప్లాన్ అవసరం. ఆ విషయంలో శైలేష్ కొలను ఇప్పటికే విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు అదే తరహాలో శ్రీకాంత్ ఓదెల కూడా తన సినిమాల ద్వారా కొత్త యూనివర్స్‌ను ప్లాన్ చేస్తున్నారా? ఆకట్టుకునే ఫ్రాంచైజీని రూపొందించగలరా? అన్నది ఆసక్తికరంగా మారింది. రాబోయే ది ప్యారడైజ్ విడుదల తర్వాత క్లారిటీ వచ్చే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం మాత్రం ఓదెల నెక్స్ట్ స్టెప్స్‌పై అందరి ఫోకస్ ఉంది.

# కంబ్యాక్ హిట్ తర్వాత సూర్య ఎమోషనల్ డెసిషన్




తమిళ స్టార్ హీరో సూర్య కెరీర్‌లో కరుప్పు సినిమా ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. గత కొన్నేళ్లుగా థియేటర్లలో భారీ విజయాన్ని అందుకోవడానికి ఎదురు చూస్తున్న సూర్యకు ఈ సినమా నిజమైన కంబ్యాక్ హిట్‌గా నిలిచింది. రిలీజ్ ముందే అనేక అంచనాలు నెలకొల్పిన కరుప్పు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని నమోదు చేయడంతో పాటు సూర్య అభిమానులకు కూడా ఎన్నాళ్ల నుంచో ఎదురు చూస్తున్న ఆనందాన్ని అందించింది. ఈ విజయంతో సూర్య మళ్లీ తన స్టార్‌డమ్‌ను నిరూపించుకోవడమే కాకుండా, తన టీమ్ పట్ల ఉన్న గౌరవాన్ని కూడా ప్రత్యేకంగా చాటుకున్నారు. కరప్పు జర్నీ సక్సెస్‌ఫుల్‌గా కనిపించినప్పటికీ, సినిమా రిలీజ్‌కు ముందు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. రిలీజ్ ప్రక్రియలో ఏర్పడిన ఫైనాన్షియల్ అడ్డంకులను సూర్య స్వయంగా పరిష్కరించి, సినిమా సజావుగా ఆడియన్స్ ముందుకు వచ్చేలా కృషి చేశారని కూడా వార్తలొచ్చాయి. ఆ కష్టాలన్నింటిని అధిగమించి రిలీజైన కరుప్పు ఇప్పుడు తమిళనాడులో భారీ కలెక్షన్లు సాధిస్తూ బ్లాక్‌బస్టర్‌గా నిలవడం విశేషం. ఆర్థిక సమస్యలతో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు విజయోత్సాహంతో ముగియడం సూర్య కెరీర్‌లో ఒక గుర్తుండిపోయే అధ్యాయంగా మారింది. సినిమా సక్సెస్ తర్వాత హీరోలు సాధారణంగా డైరెక్టర్‌కు లేదా ప్రొడ్యూసర్లకు స్పెషల్ గిఫ్ట్ ఇవ్వడం చూస్తుంటాం. అయితే సూర్య తీసుకున్న నిర్ణయం మాత్రం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. కరుప్పు సినిమాకు పనిచేసిన సినిమాటోగ్రాఫర్ జీకే విష్ణు, మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్, ఎడిటర్ ఆర్ కళైవాణన్‌లకు బ్లాక్ మ్యాట్ మహీంద్రా BE6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ ఎలక్ట్రిక్ SUVలను గిఫ్ట్‌గా అందించారు. ఈ ముగ్గురు టెక్నీషియన్లు తమ కొత్త కార్లతో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ విషయం మరింత వైరల్ అయింది. సినిమా సక్సె స్‌కు హీరో మాత్రమే కాదు, తెర వెనుక పనిచేసే టెక్నీషియన్ల పాత్ర కూడా అంతే కీలకమని సూర్య భావిస్తూ, వారిని అభినందిస్తూ ఈ డెసిషన్ తీసుకున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా ప్రేక్షకుల దృష్టి నటీనటులపైనే ఉంటుంది. ఒక సినిమా సక్సెస్‌లో సినిమాటోగ్రఫీ, మ్యూజిక్, ఎడిటింగ్ వంటి విభాగాల కృషి ఎంత ముఖ్యమో గుర్తు చేసే ప్రయత్నంగా ఈ నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఇండస్ట్రీలో ఇతర స్టార్ హీరోలకు కూడా ఇది ఒక ఆదర్శంగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఇక కరుప్పు సక్సెస్‌తో డైరెక్టర్ ఆర్జే బాలాజీ కెరీర్ కూడా కొత్త మలుపు తిరిగింది. ఇప్పటికే పలువురు నిర్మాతల నుంచి ఆఫర్లు అందుకుంటున్న ఆయన, కరుప్పు2 పై కూడా సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కరుప్పు సీక్వెల్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, ఈ వార్త మరింత ఉత్సాహాన్ని నింపింది. ఒకవైపు బ్లాక్‌బస్టర్ విజయాన్ని ఆస్వాదిస్తూ, మరోవైపు తన టీమ్‌తో ఆ ఆనం దాన్ని పంచుకున్న సూర్య, సక్సెస్ అనేది ఒక్కరి సొత్తు కాదని, మొత్తం టీమ్ కృషికి లభించే ఫలితమని మరోసారి నిరూపించారు.

# ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా...?

**- జామి, పెద్దమజ్జిపాలెం పీహెచ్‌సీలు ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి కొండపల్లి - జామి పీహెచ్‌సీలో సిబ్బంది పనితీరు, ఆస్పత్రి అపరిశుభ్రతపై మంత్రి ఆగ్రహం - నెల రోజుల్లో పనితీరు మెరుగుపరుచుకోవాలని హెచ్చరిక - రికార్డులు సైతం సక్రమంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేసిన మంత్రి - పెద్దమజ్జిపాలెం రికార్డుల నిర్వహణ, సిబ్బంది పని తీరుపై సంతృప్తి**







**జామి,(గంట్యాడ), (రాజధాని వార్తలు):** ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా? అత్యవసర పరిస్థితుల్లో వచ్చే గర్భిణీలు బాలింతల గది అంతా అస్తవ్యస్తంగా ఉంది.. చిన్నారులు, బాలింతలు ఇన్ఫెక్షన్ల భారీన పడే ప్రమాదం ఉన్నా మీకు పట్టదా? అంటూ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జామి పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంత్రి నియోజకవర్గంలోని జామి, గంట్యాడ మండలాల్లోని ప్రాథమిక ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జామి మండల ఆస్పత్రి సిబ్బంది పనితీరు, పరిసరాల పరిశుభ్రత, రోగుల ఆన్‌లైన్ రికార్డులు సైతం సక్రమంగా లేకపోవడంతో మంత్రి తీవ్ర ఆసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది హాజరు, పేషెంట్ల ఓపి రిజిస్టర్ పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బాలింతలు చంటి బిడ్డలు ఉండే ఆపరేషన్ గది అంతటా రక్తపు మరకలు, దుమ్ము ధూళి ఉండటంతో డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి మరియు సిబ్బందిపై మంత్రి కొండపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. పేషెంట్ల పట్ల ఇంత నిర్లక్ష్యంతో విధులు నిర్వహిస్తున్నారా? అని ప్రశ్నించారు. పేషెంట్ ఆన్లైన్ రికార్డులు అడిగితే సిబ్బంది తెల్ల మొఖం వేశారు. అత్యవసర సమయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని.. 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కుక్క కాటు, పాము కాటు ఇంజక్షన్ల స్టాకు గురించి ఆరా తీశారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరు బాగోలేదని రోగుల నుంచి ఫిర్యాదులు అందకూడదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అలసత్వంగా ఉండటం మంచిది కాదని, నెల రోజుల్లో ఆసుపత్రి సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని మంత్రి హెచ్చరించారు. జామి ఆసుపత్రి విషయంపై డిఎంహెచ్‌వోతో ఫోన్లో మాట్లాడారు. జామి ఆసుపత్రిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు

**పెద్దమజ్జిపాలెం పీహెచ్‌సీ పనితీరు భేష్ అన్న మంత్రి :**

గంట్యాడ మండలం పెద్దమజ్జి పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు, వైద్యులు పల్లవి, సతీష్ కుమార్ పనితీరు బాగుండటం పట్ల మంత్రి కొండపల్లి సంతృప్తి వ్యక్తం చేసి శభాష్ అన్నారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను కలియతిరిగి పరిశీలించారు. ప్రతి నెల బాలింతలకు నిర్వహించే పరీక్షలు మంచిగా నిర్వహించాలని, పట్టణాల్లోని ఆసుపత్రులకు రోగులు రాకుండా చికిత్సలు చేయాలని సూచించారు. మండలంలోని డీకే పర్తి, వైకె పర్తి ట్రైబల్ గ్రామాల ప్రజలకు మంచి వైద్యాన్ని అందజేయాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా గర్భిణీలలో అవగాహన కల్పిస్తున్నామని వైద్యులు చెప్పటం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇదే పనితీరు కొనసాగిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని మంత్రి సూచించారు.

# డాక్టర్ గాడి ప్రసాద్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వడదెబ్బకు గురి కాకుండా ముందు జాగ్రత్తగా ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని కాళీ గాట్ కాలనీలో డాక్టర్ గాడి ప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మరియు 42వ వార్డు కార్పొరేటర్ పిన్నింటి కళావతి నేతృత్వంలో సన్ షైన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్నేహలత, డాక్టర్ తనుశ్రీలు మాట్లాడుతూ అందరూ తగినంతగా నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తాగుతుండాలి. ఆహార విహారాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ఇంకాస్త జాగరూకతతో మెలగాలని సూచించారు. దాహం వేసే వరకు ఉండకుండా రోజుకు 7–8 గ్లాసుల నీళ్లు తీసుకోవాలని కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసంలాంటివి కూడా తీసుకోవడం ఆరోగ్యకరమని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎండలోకి వెళ్లకపోవడమే మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నీలిమ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాలతో చిన్నారులకు మేలు

**- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి శ్రీనివాస్**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** వేసవి కాలంలో సమయం దుర్వినియోగం కాకుండా చిన్నారుల కోసం ఏర్పాటు చేసే వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో మేలు చేస్తాయని విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కొత్త అగ్రహారం మూడో వీధిలో నూతనంగా ప్రారంభించబడ్డ బ్లూమింగ్ మైండ్స్ ప్లే స్కూల్లో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ గురుబ్రహ్మ, గురుర్విష్ణు అంటూ ఉపాధ్యాయులను దైవస్వరూపులుగా భావించే సంస్కృతి మనది. చిన్నారులను విజ్ఞానవంతులుగా మలచి వారి భవిష్యత్తుకు ఒక దారి చూపించాల్సిన పవిత్ర బాధ్యతనునిర్వర్తించేది కాబట్టే ఉపాధ్యాయ వృత్తి అంటే అంత గౌరవం. నిజానికి, భిన్న సామర్థ్యాలు కలిగిన పిల్లలుండే తరగతిలోప్రతిఒక్కరికీ అర్థమయ్యేలా నేర్పుగా పాఠాలతో పాటు జీవిత విలువలనూ బోధించడం ఆషామాషీ విషయమేమీ కాదు. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయాన్ని వృథా చేయకుండా, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సమ్మర్ కోచింగ్ క్యాంప్" ఒక అద్భుతమైన వేదిక అని అన్నారు. సెల్‌ఫోన్లు లాప్టాప్‌లు నిత్యజీవితంలో అంతర్భాగంగా కలిసిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులను వాటికి దూరంగా ఉంచాలంటే వేసవి శిక్షణ శిబిరాలు తప్పకుండా దోహదపడతాయని అన్నారు. చిన్నారుల్లో నిబిడీ కృతమైన శక్తి సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు, వారిలో ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని నింపేందుకు, వివిధ విషయాలపై అవగాహన పెంచేందుకు, మేధస్సుకు, చురుకుదనం కల్పించేందుకు గుణాత్మకంగా పనిచేసే వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవంతంగా శిక్షణ శిబిరాన్ని పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు .వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లూమింగ్ మైండ్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ సముద్రాల గిరిజా ప్రసన్న, ప్రిన్సిపాల్ కళ్యాణి, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా కార్డులు పంపిణీ

**- జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** కౌలు రైతులకు సి.సి.ఆర్.సి పత్రాలు, యూరియా కార్డులు, నవధాన్యాల విత్తనాలు జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు పంపిణీ చేశారు. మండలంలోని కొనిస, కొత్తబగ్గం రైతు సేవ కేంద్రాలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక రైతు నవధాన్య విత్తనాలు తొలకరి జల్లు పడిన వెంటనే చల్లుకోవాలని సూచించారు. అన్ని రైతు సేవ కేంద్రాలకు పచ్చి రొట్ట ఎరువులు, వరి విత్తనాలు వచ్చాయని, రైతులు అందరు వరి విత్తనాలతో పాటు విత్తన శుద్ధి పౌడర్ తీసుకోవాలన్నారు. వరి విత్తనాలకు విత్తన శుద్ధి కోసం 250 గ్రాముల సూడోమోనస్ పౌడర్ ఒక ఎకర విత్తనం కోసం సరిపోతుందన్నారు. దీని ధర 40 రూపాయలు వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏ.డి. ఏ గాలి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పీ.కిరణ్ కుమార్, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

# మహిళలు చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలి : సి.ఐ ఎస్.సన్యాసినాయుడు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మహిళలు చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. సన్యాసినాయుడు అన్నారు. శనివారం మండలంలోని మరుపల్లి, ఎం. గుమడాం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు అవగాహన సదస్సు చేపట్టారు. ఈ సందర్భంగా సీ.ఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన ద్వారా న్యాయం పొందవచ్చు అన్నారు. సైబర్ మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి మత్తులో యువత పడుతున్నారని, మీ పిల్లల కదలికలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సి.ఐ సన్యాసినాయుడు తల్లిదండ్రులకు సూచించారు. గ్రామాల్లో గంజాయి ఆనవాళ్లు కనిపిస్తే తమకు సమాచారం అందజేయాలన్నారు. మహిళా సాధికారతతోనే సమాజం, దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ – ఇన్స్పెక్టర్ కె.కిరణ్ కుమార్ నాయుడు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ఎరువుల కొనుగోలు యాప్‌పై శిక్షణ




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలంలో ఉన్న ఎరువుల డీలర్లు, సొసైటీ సెక్రటరీలకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు సామర్లకోటలోని రైతు భవన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఎరువులు కొనుగోలు, అమ్మకాల యాప్‌పై సొసైటీ సెక్రటరీలకు, వ్యవసాయ సహాయకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ యాప్ ద్వారా రైతులు మూడు రకాల పద్ధతుల్లో ఎరువులు బుక్ చేసి పొందవచ్చునన్నారు. దీనిలో రైతులు 11 అంకెలు గల నంబర్ల ద్వారా ఎరువులను బుక్ చేసుకోవడం, అలాంటి గుర్తింపు సంఖ్య లేని రైతులు ఆధార్ నంబర్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవడం, ఇంకా మూడవదిగా కౌలు రైతులు డి పట్టా ఎండోమెంట్ ల్యాండ్ ద్వారా ఎరువులను ఎలా బుక్ చేసుకోవాలి అనే అంశాలపై మండల విద్యాశాఖ అధికారి వి మురళీధర్ శిక్షణనిచ్చారు. ఈ యాప్ ద్వారా రైతులు వారు సాగు చేయదలచిన పంటను ఎంపిక చేసుకోవడం, దానికి అవసరమైన ఎరువులను ఎంపిక చేసుకోవడం, ఆ ఎరువులను ఏ డీలర్ ద్వారా పొందవచ్చునో ఎంపిక చేసుకోవడం ద్వారా వారు ఒక టోకెన్లు జనరేట్ చేసుకోవచ్చునన్నారు. ఈ ప్రక్రియ ద్వారా రైతులకు ఒక క్యూఆర్ కోడ్ వస్తుంది అన్నారు. దానిని మూడు రోజుల్లోపు ఉపయోగించుకుని డీలర్ దగ్గర నుంచి రుసుము చెల్లించి నేరుగా ఎరువులు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆ సమయంలో ఎరు వులు అవసరం లేదు అనుకుంటే క్యూఆర్ కోడ్‌ను రద్దు చేసుకోవచ్చని అన్నారు. రైతు స్వయంగా గాని, అతని తరఫున ఎవరైనా కానీ క్యూఆర్ కోడ్ చూపించి అవసరమైన ఎరువులను పొందే అవకాశం ఉందన్నారు. ఈ విధానం ద్వారా రైతులకు అందించే సబ్సిడీ ఎరువులు ఇతర పరిశ్రమలు వ్యక్తులకు అందకుండా జాగ్రత్త పడే అవకాశం ఉందన్నారు. ఈ యాప్ ద్వారా శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మోతాదు మేరకే రైతులకు ఎరువులను అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ సెక్షన్లో మేడపాడు సొసైటీ అధ్యక్షులు పాలకుర్తి రవి, ఏ ఈ ఓ లు రూప, శాంతి, మండల, గ్రామస్థాయిలోని వ్యవసాయ సహాయకులు, సొసైటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# శృంగార వల్లభుని ఆదాయం రూ. 3.06 లక్షలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలంలోని తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగారవల్లభ స్వామి దేవస్థానమునకు భక్తులు శ్రీస్వామికి శనివారం ఒక్కరోజు ఆధాయంగా రూ. 3,06,770 ఆధాయం చేకూరింది. శనివారం సుమారు 25 వేలు మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ శృంగార వల్లభస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టి విశేష రీతిలో పూల అలంకరణ చేపట్టారు. కాగా ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,02,460లు, అన్నదాన విరాళములు ద్వారా రూ. 69,175లు, కేశ ఖండన ద్వారా రూ. 8400 లు, తులాభారం ద్వారా రూ. 350 లు, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 26,385 లు, వెరశి రూ. 3,06,770 ఆదాయం సమకూరినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డాది శ్రీనివాసరావు తెలిపారు. కాగా దేవస్థానం తరుపున భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ కార్యక్రమంతో పాటు వేసవి దృష్ట్యా భక్తులకు మజ్జిగ పంపిణి చేసారు. అలాగే ఆలయంలో సుమారు 4,500 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

ఈ పూజల్లో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషో త్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ మెయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొని సేవలనందించారు.

# ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యదర్శులుగా చిరంజీవి, బాబు

## - హార్దిక శుభాకాంక్షలు తెలిపిన ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు





**గూడూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిరంతరం పోరాటం చేసే ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శిగా ఎస్ కే బాబులను విజయవాడలో జరిగిన నూతన కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. శనివారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 రాష్ట్ర నూతన కౌన్సిల్ సమా వేశం జరిగింది. ఈ సమావేశంనందు రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా రాబోయే రెండు సంవత్సరాలకు చిల్లకూరు మండలం పాలిచర్ల వారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న సంచి చిరంజీవి అదేవిధంగా గూడూరు మండలం లోని నెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు హిందీ ఉపాధ్యా యునిగా పనిచేస్తున్న ఎస్.కె.బాబులను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వీరిరువురు గూడూరు ప్రాంత ఉపాధ్యా యుల సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడు ముందుంటారని వీరు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదగడం గూడూరు ప్రాంత ఉపాధ్యాయులకు వారి సమస్యలు తీర్చుకో వడానికి ఒక శుభ పరిణామంగా ఉంటుందని గూడూరు మండల ఏపిటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రెండు సంవత్సరాలు ఉపాధ్యాయ వర్గాల సమస్యలైన సర్వీసు, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరిస్తూ ఉపాధ్యాయ సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేయాలని, విద్యార్థుల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ కే.బాబులకు ఏపిటిఎఫ్ గూడూరు మండల అధ్యక్షుడు ఏ. భాస్కర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎమ్.లక్ష్మీనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.జైపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బి.శివకుమార్‌లు, గూడూరు టౌన్ నాయకులు శివరాం ప్రసాద్, షఫీ, మోహన్, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడమైనది.

# విదేశీ విద్యపై ఆసక్తి ఉంటే గ్లోబల్ డిగ్రీస్‌ను సంప్రదించండి

## - గ్లోబల్ డిగ్రీస్ ఎడ్యుకేషన్ అండ్ మోర్ కన్సల్టెన్సీ సర్వీస్ ఎండీ మీనా కుమార్ జస్టీ




**నెల్లూరు టౌన్, (రాజధాని వార్తలు):** దేశ విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు లేదా వారి తరఫున తల్లిదండ్రులు గ్లోబల్ డిగ్రీస్‌ను సంప్రదించగలరని గ్లోబల్ డిగ్రీస్ ఎడ్యుకేషన్ అండ్ మోర్ కన్సల్టెన్సీ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ మీనా కుమార్ జస్టీ కోరారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని కోర్సులలో ముఖ్యంగా ఎమ్మెస్, మెడిసిన్, పీజీలను అభ్యసించేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆస్ట్రేలియా, కెనడా యూకే లండన్, యూఎస్ఏ, జర్మనీ ఇటలీ, ఐర్లాండ్ న్యూజిలాండ్‌లకు తమ ద్వారా పంపిస్తామని ఆయన వెల్లడించారు. ఉచిత, స్కాలర్షిప్, పెయిడ్‌కు సంబంధించిన విద్య చదువుకునేందుకు అవకాశం ఉన్నదన్నారు. తక్కువ ఖర్చుతో డిగ్రీ పూర్తి చేసుకుని రాగలరని తెలిపారు అలాంటి అవకాశాన్ని తమ సంస్థ కల్పిస్తున్నదని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాము 2015లో హైదరాబాదులో ఈ సంస్థను ఏర్పాటు చేశామని, ఈ 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా 20 బ్రాంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ద్వారా ఇతర దేశాలలోని మంచి లేదా పెద్ద యూనివర్సిటీలలో వేల మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇప్పించి పంపించామని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణలో మంచి మార్కులు సాధించి ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు జర్మనీ, ఫ్రాన్స్ యూనివర్సిటీలలో ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించామన్నారు. లివింగ్ ఎక్స్పెన్సివ్ సౌకర్యం కూడా కల్పించామని తెలిపారు. ఇటీవల తాము ట్రాన్స్లేషన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాము ప్రారంభించామన్నారు. చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ లీ సిస్టర్ యూకెలో ఉన్న యూనివర్సిటీతో లింక్ చేశామన్నారు. ఇంటర్మీడియట్ పూర్తయిన వారు రెండు సంవత్సరాలు పాటు చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో బ్యాచ్లర్ ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్, బిబిఏ ప్రోగ్రాంలో మంచు మార్కులు సాధించిన వారిని డిగ్రీ యూకేలోని ఆ యూనివర్సిటీకి పంపిస్తామన్నారు. నెల్లూరులో తాము బ్రాంచ్ ఏర్పాటుచేసి రెండేళ్లు అయిందన్నారు. ఈ రెండేళ్లలో నెల్లూరు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 200 మందిని విదేశాలకు ఉన్నత విద్య అభ్యసించేందుకు పంపామని తెలిపారు. మళ్లీ ఇప్పుడు ఎందుకు ఆ విషయం చెబుతున్నాను అంటే నెల్లూరులో సర్వీసులు బాగున్నందున మళ్లీ ఒకసారి అందరికీ తెలియజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఎకడమిక్ శాతం, ఆర్థిక పరిస్థితులను బట్టి కోర్సులు ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఏఐ, డేటా సైన్స్, క్వాంటం కంప్యూటర్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఇక్కడి నుంచి విదేశాలకు చేరుకున్న తర్వాత కూడా వాళ్ళ బాధ్యతలను జాగ్రత్తగా చూసుకుంటామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు వారి తల్లిదండ్రులు మరిన్ని వివరాలకు నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఎన్‌విఆర్ సెంట్రల్ అగర్వాల్ హాస్పిటల్ పైన మూడో ఫ్లోర్లో ఉన్న తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. 72077 70917, 7207770918 నంబర్లను కూడా సంప్రదించవచ్చని సూచించారు. విలేకరుల సమావేశంలో సీనియర్ కన్సల్టెన్సీ ఈర్తినేని రామారావు, కన్సల్టెంట్ జెవి కళ్యాణ్ పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలందరూ సహకరించాలి

## - ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ




**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** స్వచ్ఛ్ ఆంధ్ర-స్వర్ణాంధ్ర సాధనకు నియోజకవర్గ ప్రజలు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు. శనివారం సూళ్లూరుపేట పట్టణంలోని ఫిష్ మార్కెట్ ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో డాక్టర్ నెలవల విజయశ్రీ పారిశుధ్య కార్మికులతో కలిసి డ్రైనేజీ కాలువ పూడిక తీశారు. అనంతరం ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మున్సిపల్ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన"స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర" లక్ష్యం సాధనకు ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవేంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నేత తిరుమూరు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 60 మంది ఔట్‌పేషెంట్లకు వైద్య పరీక్షలు



**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌లో డా.రవికృష్ణ కలతూర్ ఆధ్వర్యంలో శనివారం పెయిన్ క్లినిక్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే సహకారం, ప్రోత్సాహంతో నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ క్యాంప్‌లో మొత్తం 60 ఔట్ పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించగా 15 ప్రొసీజర్లు చేశామని వైద్యులు తెలిపారు. ముఖ్యంగా ఎపిడ్యూరల్ స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, ఇంట్రా-ఆర్టిక్యులర్ షోల్డర్ ఇంజెక్షన్లు, ఇంట్రా-ఫోరామినల్ లంబార్ ఇంజెక్షన్లు వంటి చికిత్సలు అందించామన్నారు. నొప్పితో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన, సకాలంలో చికిత్స అందించే లక్ష్యంతో ఈ శిబిరం నిర్వహించామని ఆయన తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## - ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ





**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** సూళ్లూరుపేట నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. శనివారం ఎమ్మెల్యే సూళ్లూరుపేట మండలంలోని కడపత్ర గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వారి సమస్యల పరిష్కారం కోసం అందించిన వినతి పత్రాలను స్వీకరించారు. కడపత్ర గ్రామపంచాయతీ నుండి అందిన 177 అర్జీలను సంబంధిత అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సులూరుపేట తహసిల్దార్ శైల కుమారి, సూళ్లూరుపేట మండల రూరల్ టీడీపీ అధ్యక్షులు పాకం వెంకటసు బ్బయ్య, మాజీ అధ్యక్షులు కొక్కు శంకరయ్య, మాజీ సర్పంచులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, సుధాకర్ రెడ్డి, తిరుపాలు, మురళి రెడ్డి, మండల ఐటీడీపీ అధ్యక్షులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చెస్ విజేతలకు బహుమతులు అందజేత




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఉచిత చెస్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు, విద్యార్థులకు శనివారం బహుమతులను చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిటీ వారు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపిపి (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్యాసిక్యూటర్) జయసారధి, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ త్రివేణి, సోషల్ ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ లలితమ్మ, ‌‌తాగూర్లు విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి శ్యాం ప్రసాద్, కార్యదర్శి కెఎస్‌బి సూర్యప్రకాష్ తమ ప్రసంగంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా పిల్లల్లో మానసిక నైపుణ్యాన్ని పెంపొందించుటకు, క్రీడలపై మక్కువ పెంచాలన్న ఉద్దేశంతో ప్రత్యేక చదరంగం కోచింగ్ నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలలో పిల్లలు పాల్గొని వారి నైపుణ్యాన్ని వెలికి తీయటమే తమ లక్ష్యమని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీపీ జయసారధి మాట్లాడుతూ చిన్నారులు ఇంత చిన్న వయసులో చదరంగం పట్ల ఆసక్తి చూపి పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. చెస్ కేవలం ఆట కాదు అని, మెదడు కూడా మంచి వ్యాయమమని, పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ ఉపయోగకరమైన ఆట చెస్ అన్నారు. ఎస్.సంస్థ అధ్యక్షులు వి.హేమకుమార్ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు చిన్నారులు సద్వినియోగం చేసుకుని ఆహ్లాదంగా ఆటలు నేర్చుకో వడం వలన ఎత్తుకు పై ఎత్తు ఎలా వెయ్యాలని, వాటిపై మంచి అవగాహన కలుగుతుందన్నారు. ట్రెజరర్ ఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చెస్ ఆడేటప్పుడు మెదడు రెండు వైపులా పనిచేస్తుందని లాజిక్ కోసం ఎడమ వైపు, ఊహ క్రియేటివిటీ కోసం కుడివైపు ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. ప్రత్యర్థి ఎత్తులు మనం ఆడిన పాత గేములు అన్ని గుర్తుంచుకోవాల్సి ఉంటుందని, రోజూ చెస్ ఆడే వారిలో మతిమరుపు వ్యాధి వచ్చే రిస్క్ తక్కువ అని ఆయన అన్నారు. దీంతో మెమరీ ఫోకస్ ప్లానింగ్,పేషెన్స్ అన్ని ఒకేసారి పెరుగుతాయన్నారు. కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ త్రివేణి మాట్లా డుతూ నేటి సమాజంలో చిన్నారులు ఫోన్లకు అంకితమైపోతున్నారని, ఇలాంటి సమయంలో పిల్లల ఏకాగ్రతను దృష్టిని మార్చుటకు చదరంగం ఒక గొప్ప క్రీడ అన్నారు. హనేబుల్ ప్రెసిడెంట్ భక్తవత్సలం మాట్లాడుతూ రోజు చదరంగం అనే ఆట 30 నిమిషాల పాటు ఆడిస్తే చదువులో, గణితంలో లాజిక్ బాగా పెరుగుతుందని అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పాఠశాలల్లో చిన్నారులకు, విద్యార్థు లకు చెస్ కాంపిటేషన్ పెడుతున్నారన్నారు. విద్యార్థులకు, చిన్నారులకు మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. అంతేకాకుండా చదరంగం ఆట నేర్చుకునే చిన్నారులకు కూడా కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి శ్యాంప్రసాద్, కార్యదర్శి సూర్య ప్రకాష్, ట్రెజరరి ఎం.లక్ష్మీనారాయణ,ఆర్గనైజర్ కె.సురేష్ బాబు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : విద్యార్థి సంఘాల డిమాండ్




**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని ఒకటో పట్టణ పరిధిలో సరైన అనుమతులు లేని భవనంలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తూ గూడూరు ఆర్డీవో కార్యాలయ ఏవో శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 13న జరిగిన గ్రీవెన్స్‌లో మున్సిపల్ అధికారులు ఈ బిల్డింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవని చెప్పినప్పటికీ, నెల తిరగకముందే నిబంధనలకు విరుద్ధంగా పర్మిషన్ వచ్చిందని చెప్పడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే, టూ టౌన్ పరిధిలోని మరో ప్రైవేటు కళాశాలను కొనుగోలు చేసి, లొకేషన్ షిఫ్టింగ్ అనుమతులు లేకుండానే ఇక్కడ తరగతులు నడుపుతున్నారని, కోర్టు పరిధిలో ఉన్న ఈ అంశానికి అధికారులు ఎలా రెన్యువల్ ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కళాశాల పిఆర్‌ఓలు మాయమాటలతో అడ్మిషన్లు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అటువంటి కళాశాలలను ప్రోత్సహించవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వెంకటేష్, నాయకులు చందు, గిరి, వేణు తదితరులు పాల్గొని, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# గల్ఫ్ దేశాలతో సరికొత్త వాణిజ్య ఒప్పందం

## - భారతీయ కార్మికులు, రైతులు, ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం



జూన్ 1 నుంచి 'భారతదేశం-ఒమన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' అమలులోకి వచ్చింది. కొత్త మార్కెట్లను అవకాశాలను ఏర్పరిచి, ఉద్యోగాల కల్పనను వేగవంతం చేయడం ద్వారా భారతదేశంలోని విద్యార్థులు, చేతివృత్తుల వారు, మహిళలు, రైతులు, మత్స్యకారులు, ఎంఎస్ఎంఈల (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల) శ్రేయస్సు కోసం ప్రపంచవ్యాప్తంగా మార్గాలను సృష్టించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో ఇదో చారిత్రాత్మక మైలురాయి. దాదాపు 7 లక్షల మంది భారతీయులు నివసిస్తున్న ఒమన్‌తో భారత్‌కు బలమైన ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలున్నాయి. అక్కడి వ్యాపార కుటుంబాలలో కొందరి మూలాలు 200-300 సంవత్సరాల నాటివి. ఒమన్ నుంచి భారతదేశానికి వచ్చే విదేశీ నగదు ఏటా సుమారు 2 బిలియన్ డాలర్లుగా ఉంది, అలాగే 6,000 పైగా భారతీయ సంస్థలు అక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ), ఆర్థిక మరియు వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. ఇది భారత ఎగుమతులలో 99.38 శాతాన్ని కవర్ చేస్తూ, ఒమన్‌లోని 98% టారిఫ్ లైన్లలో (ఉత్పత్తులపై) తక్షణమే 100 శాతం పన్ను రహిత మార్కెట్ అవకాశాన్ని కల్పిస్తుంది. సీఈపీఏ ఒప్పందానికి ముందు కేవలం 15.3 శాతం భారతీయ ఎగుమతులు మాత్రమే ఒమన్‌లోకి పన్ను రహితంగా ప్రవేశించడానికి అనుమతి ఉండేది. దానితో పోలిస్తే ఇది చాలా పెద్ద మార్పు. ప్రస్తుతం ఒమన్‌లో 5 శాతం దిగుమతి పన్నును ఎదుర్కొంటున్న సుమారు 3.64 బిలియన్ డాలర్ల విలువ కలిగిన భారతీయ వస్తువులు, ఇప్పుడు అక్కడ మరింత పోటీని తట్టుకుని నిలబడగలుగుతాయి. భారతదేశంలోని ఎంఎస్ఎంఈలకు ఈ ఒప్పందం విప్లవాత్మకమైనది కావచ్చు, ఎందుకంటే సీఈపీఏ ద్వారా లాభం పొందే అనేక రంగాలు చిన్న వ్యాపారుల చేతుల్లోనే ఉన్నాయి. ఇనుము & ఉక్కు, వస్త్రాలు, తోలు, ఆటో విడిభాగాలు, పారిశ్రామిక పరికరాలు వంటి రంగాలలో ఎంఎస్ఎంఈ లకు పెద్ద ఎత్తున అంతర్జాతీయ ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంది. ఇది ఉత్పత్తి, పెట్టుబడి, ఉపాధిని పెంచుతుంది. పెరుగుతున్న ప్రపంచ అస్థిరతల కాలంలో, ఆర్థిక మందగమనం, పెరుగుతున్న వాణిజ్య అడ్డంకులను ఎదుర్కొంటున్న సాంప్రదాయ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి మరియు మార్కెట్లను విస్తరించుకోవడానికి భారతీయ ఎగుమతిదారులకు ఈ సీఈపీఏ ఒక కీలకమైన అవకాశాన్ని అందిస్తుంది.

**ఉద్యోగాల సృష్టి**

ఈ వాణిజ్య ఒప్పందం భారతదేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న వస్త్రాలు & దుస్తులు, తోలు & పాదరక్షలు, ఆహార ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, రత్నాలు & ఆభరణాలు, కొన్ని ఇంజనీరింగ్ విభాగాలు వంటి శ్రమతో కూడిన రంగాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. ఒమన్‌కు వస్త్రాల ఎగుమతులు పెరగడం వల్ల తిరుపూర్, సూరత్, లూథియానా, పానిపట్, కోయంబత్తూర్, కరూర్, భదోహి, మొరాదాబాద్, జైపూర్, అహ్మదాబాద్ వంటి ప్రధాన కేంద్రాలలో ఉత్పత్తి పెరిగి కొత్త ఉద్యోగాలు వస్తాయి. తమ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడం వల్ల భారత్‌లోని చేతివృత్తులవారు, చేనేత కార్మికులు కూడా లబ్ధి పొందుతారు. భారతదేశంలోని ప్రధాన తోలు, పాదరక్షల కేంద్రాలైన తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాలలో కూడా అనేక ఉద్యోగాలు లభిస్తాయి. రత్నాలు, ఆభరణాల రంగం కూడా ఈ సీఈపీఏ ఒప్పందం ద్వారా ఉపాధి వృద్ధిని ఎలా వేగవంతం చేస్తుందనే దానికి మరొక ఉదాహరణ.. కట్ అండ్ పాలిష్ చేసిన వజ్రాలు, బంగారం, వెండి ఆభరణాలు, చేతితో చేసే ఆభరణాల తయారీలో భారతదేశానికి ఇప్పటికే బలమైన నైపుణ్యం ఉంది. పన్ను అడ్డంకులు తొలగిపోవడంతో, యూరప్, ఆసియాలోని ప్రత్యర్థులపై భారతీయ ఎగుమతిదారులు స్పష్టమైన ఆధిక్యతను సాధిస్తారు. రాబోయే మూడేళ్లలో ఒమన్‌కు ఎగుమతులు 150 మిలియన్ డాలర్ల వరకు పెరగవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇది పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌లలోని ఆభరణాల తయారీ కేంద్రాలలో గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు.

**రైతులు, మత్స్యకారులు**

దేశీయ రైతులను, సున్నితమైన వ్యవసాయ ప్రయోజనాలను కాపాడటానికి గోధుమలు, బియ్యం, మొక్కజొన్న, చిరుధాన్యాలు, పాల ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, వంట నూనెలు, నూనెగింజలు, టీ, కాఫీ, తేనె వంటి ప్రధాన ఉత్పత్తులకు భారత్ ఎటువంటి పన్ను రాయితీలు ఇవ్వలేదు. అయినప్పటికీ వెన్న, తేనె, స్వీట్ బిస్కెట్లు, గుడ్లు, కొన్ని రకాల మిఠాయి ఉత్పత్తులలో భారతదేశం తన ప్రత్యర్థుల కంటే మెరుగైన పోటీతత్వాన్ని పొందుతుంది. ఇది దేశంలోని వ్యవసాయ ఉత్పత్తుల డిమాండ్‌ను పెంచి, గ్రామీణ ఆదాయాలను పెంచుతుంది. ఈ ఒప్పందం భారతదేశ 'నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్' ధృవీకరణను అంగీకరించడానికి, గుర్తించడానికి కూడా వీలు కల్పిస్తుంది. ఇది ప్రధాన ఆహార దిగుమతిదారునిగా ఉన్న ఒమన్‌కు, భారతీయ రైతులు సేంద్రీయ ఉత్పత్తులను విక్రయించడానికి మంచి అవకాశాలను ఇస్తుంది. సముద్ర ఉత్పత్తులకు కూడా ఇక్కడ భారీ మార్కెటింగ్ అవకాశాలున్నాయి. 2022, 2024 మధ్య కాలంలో ఒమన్ సముద్ర ఉత్పత్తుల దిగుమతి సుమారు 119 మిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో భారతదేశం నుండి దిగుమతులు కేవలం 7.75 మిలియన్ డాలర్లు మాత్రమే, ఇది రొయ్యలు, ఫ్రోజెన్ కటిల్‌ఫిష్ వంటి భారతీయ సముద్ర ఆహార ఎగుమతులకు అపారమైన అవకాశాలను కల్పిస్తుంది. ఎక్కువ శ్రమతో కూడిన ఈ సముద్ర ఉత్పత్తుల పరిశ్రమ చేపల వేట, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, కోల్డ్-చైన్ లాజిస్టిక్స్, ఎగుమతి కార్యకలాపాలలో అదనపు ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉంది.

**ఫార్మా, సాంప్రదాయ వైద్యం**

యుఎస్ఎఫ్డీఏ, ఈఎంఏ, యూకే ఎంహెచ్ఆర్ఏ, టీజీఏ వంటి అంతర్జాతీయ నియంత్రణ సంస్థల ఆమోదం పొందిన భారతీయ ఔషధాలకు ఒమన్‌లో 90 రోజులలోపు ఆటోమేటిక్‌గా మార్కెటింగ్ అనుమతి లభిస్తుంది - ఇది భారతీయ ఫార్మా ఎగుమతిదారులకు ఒక పెద్ద విజయం. ముఖ్యంగా, ఈ సీఈపీఏ ఒప్పందం భారతదేశ సాంప్రదాయ వైద్య సేవలకు కూడా అవకాశాలను సృష్టిస్తుంది. ఇది సాంప్రదాయ వైద్యంలో ఉమ్మడి పరిశోధనలకు వీలు కల్పిస్తుంది.

**సేవలు, ప్రయాణ సౌలభ్యం**

ఈ ఒప్పందంలోని మరో ముఖ్యాంశం సేవలు మరియు కార్మికుల ప్రయాణ సౌలభ్యానికి సంబంధించింది. వృత్తిపరమైన సేవలు, కంప్యూటర్, ఐటీ సేవలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం, పరిశోధన, అభివృద్ధి, పర్యావరణ సేవలు వంటి భారతదేశానికి ప్రధాన ఎగుమతి ఆసక్తి ఉన్న రంగాలలో ఒమన్ వాణిజ్యపరంగా అర్థవంతమైన హామీలను ఇచ్చింది. అకౌంటింగ్, ఇంజనీరింగ్, మెడిసిన్, నిర్మాణం, విద్య, కన్సల్టింగ్ వంటి రంగాలలోని భారతీయ నిపుణులు మెరుగైన మార్కెట్ అవకాశాల ద్వారా ప్రయోజనం పొందుతారని భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా, భారతీయ నిపుణులు, కార్మికుల కోసం ఒమన్ మెరుగైన ప్రయాణ నిబంధనలకు అంగీకరించింది. కంపెనీల అంతర్గత బదిలీదారులు, ఒప్పంద సేవా సరఫరాదారులు నాలుగు సంవత్సరాల వరకు అక్కడ ఉండటానికి అనుమతి లభిస్తుంది, అలాగే వ్యాపార సందర్శకులు, స్వతంత్ర నిపుణులకు తాత్కాలిక ప్రవేశ నిబంధనలు సులభతరం చేస్తారు. కంపెనీల అంతర్గత బదిలీదారుల పరిమితిని ఒమన్ 20 శాతం నుంచి 50 శాతానికి పెంచింది. అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడానికి మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ, ప్రతి భారతీయుడి జీవితాన్ని మెరుగుపరచాలనే ప్రధానమంత్రి సంకల్పంలో భాగమే. ఒమన్‌తో కుదిరిన ఈ ఒప్పందం, వాణిజ్యం అనేది వృద్ధికి, ఉద్యోగాల కల్పనకు, భాగస్వామ్య శ్రేయస్సుకు శక్తివంతమైన సాధనమని గుర్తు చేస్తుంది. విభజనలు, రక్షణాత్మక విధానాలు పెరుగుతున్న ప్రపంచంలో, నూతన, ఆత్మవిశ్వాసంతో కూడిన భారత్ తన చుట్టూ గోడలు కట్టుకుని వెనక్కి తగ్గదని ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నారు. ఇది భాగస్వామ్యాలు, పోటీతత్వం, ప్రపంచవ్యాప్త భాగస్వామ్యం ద్వారా మరింత పైకి ఎదుగుతుంది.

రచయిత:
**పీయూష్ గోయల్,**
కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రి

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan